RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 218 మేడ్చల్ మల్కాజ్‌గిరి 30 ఆగష్టు 2024 శుక్రవారం పేజీలు : 4

## పాస్‌పోర్ట్ ఆన్ లైన్ సేవలకు అంతరాయం

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ పాస్ పోర్ట్ సేవలు తాత్కాలికంగా నిలిపివేస్తున్న ట్లు కేంద్ర విదేశాంగ శాఖ ప్రకటించింది. ఈ రోజు నుంచి అంటే.. ఆగస్ట్ 29వ తేదీ రాత్రి 8.00 గంటల నుంచి ఈ సేవలు నిలిపియేనున్నట్లు వెల్లడించింది. సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం 6.00 గంటలకు ఈ సేవలు పునరుద్ధరించ బడతాయని పేర్కొంది. సేవల నిర్వహాణలో భాగంగా పాస్ పోర్ట్ సేవలను నిలిపి వేస్తున్నట్లు పేర్కొంది.

ఇప్పటికే ఈ అయిదు రోజుల్లో ముందుగా షెడ్యూల్ కేటాయించిన వారికి.. మరో తేదీతోపాటు సమయాన్ని సైతం ఖరారు చేస్తామని తెలిపింది. ఇక ఆగస్ట్ 30వ తేదీన ముందుగా పాస్ పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిని ఇప్పటికే రద్దు చేసినట్లు తెలిపింది. మరో తేదీలతో వారికి అపాయింట్‌మెంట్లు కేటాయిస్తామని.. అందుకు సంబంధించి వారి ఫోన్లకు సందేశాలు పంపుతామని చెప్పింది.



# హైడ్రా మరో పెను సంచలనం

## దుర్గంచెరువు చుట్టూ ఉండే ఇళ్లు, ఆఫీస్‌లకు నోటీసులు

హైదరాబాద్‌లోని దుర్గంచెరువు ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు ఫోకస్ చేశారు. దుర్గంచెరువును ఆనుకుని పలువురు ప్రముఖుల ఖరీదైన భవనాలు నిర్మించినట్లు, అవన్నీ ఎఫ్‌టీఎల్ జోన్‌లో పరిధిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో గురువారం ఉదయం దాదాపు 204 మందికి శేరిలింగంపల్లి తహశీల్దార్ నోటీసులు పంపారు. 30 రోజుల్లోగా ఎవరికి వారే అక్రమంగా, నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన భవనాలు అన్నీ స్వచ్ఛందంగా కూల్చివేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు. లేకపోతే తామే స్వయంగా రంగంలోకి దిగి కూల్చివేస్తామని అధికారులు స్వీట్ వార్నింగ్ ఇచ్చారు.

ఇదిలా ఉండగా.. ఈ నోటీసులు అందుకున్న వారిలో సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి కూడా ఉన్నట్లు సమాచారం. ఎఫ్‌టీఎల్ జోన్‌లోనే అద్దెకు ఉంటున్న తిరుపతి రెడ్డి ఇంటికి ఈ ఉదయం అధికారులు నోటీసులు జారీ చేశారు. నెక్లార్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, కావూరి హిల్స్, అమర్ కోఆపరేటివ్ సొసైటీలోని నివాసాలకు నోటీసులు అందజేశారు. కాగా, రాష్ట్రంలో హైడ్రా దూకుడు కొందరికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. చెరువులు, నాళాల ఆక్రమణలకు పాల్పడి, అనుమతులు లేకుండా భవనాలు నిర్మించినవారి జాబితాలను ఇప్పటికే హైడ్రా సేకరించింది. ఒక్కొక్కరిగా అందరి భరతం పడుతూ వస్తోంది. ప్రస్తుతం హైటెక్‌సిటీలోని రాయదుర్గం, మాదాపూర్ పరిధిలో ఉండే దుర్గం చెరువు చుట్టూ విలాసవంతమైన భవనాలు నిర్మించినవారు హడలెత్తిపోతున్నారు. దుర్గం చెరువులోని కాలనీల్లో మొత్తం 204 ఇండ్లకు జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేసారు. వీరిలో సినీ, రాజకీయ ప్రముఖులు ఉన్నారు.

# చెరువుల కబ్జాలపై రేవంత్ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం..

హైదరాబాద్: చెరువుల కబ్జాలపై రేవంత్ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లలో ఉన్న నిర్మాణాలకు నోటీసులు అందజేసింది. శేరిలింగంపల్లి మండల పరిధిలోని 5 చెరువుల పరిధిలోని ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలకు నోటీసులు జారీ చేసింది. 5 చెరువుల పరిధిలో 204 నిర్మాణ యజమానులకు నోటీసులు జారీ చేసింది. దుర్గం చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో నెక్టర్స్ కాలనీ, డాక్టర్స్ కాలనీ,కావూరి హిల్స్, అమర్ సొసైటీ వాసులకు 77 నోటీసులు అందజేసింది. పలు ఇళ్లకు నోటీసులను సైతం శేరిలింగంపల్లి రెవెన్యూ సిబ్బంది అంటించారు. నెల రోజుల గడువు ఇస్తూ ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించి కట్టిన నిర్మాణాలను స్వచ్ఛందంగా కూల్చివేయాలని నోటీసుల్లో అధికారులు స్పష్టం చేశారు. దుర్గం చెరువులో ఒక్కరోజే నాలుగు కాలనీల్లోని వందల ఇళ్లు, వాణిజ్య సముదాయాలకు రేవంత్ ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. వాల్టా చట్టంలోని సెక్షన్ 23(1) కింద నోటీసులు జారీ చేయడం జరిగింది. యజమానులు కూల్చుకుంటే ఓకే.. లేని పక్షంలో తామే కూల్చివేతలు చేపట్టాల్సి ఉంటుందని నోటీసుల్లో హెచ్చరికలు జారీ చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్.. ఎన్ కన్వెన్షన్ కూల్చివేత తర్వాత పెద్దగా బయటకు వచ్చింది లేదు. కార్యాలయంలోనే ఉంటూ అధికారులతో సమావేశాల మీద సమావేశాలు నిర్వహిస్తున్నట్టుగా వార్తలొచ్చాయి. అందరూ అనుకున్నట్టే జరిగింది. మరో బాంబ్ పేల్చేందుకు కాస్త సమయం తీసుకుంటున్నారని అంతా భావించారు. చివరకు అదే జరిగింది. మొత్తానికి హైడ్రా పెద్ద బాంబే పేల్చింది. 5 చెరువుల పరిధిలో 204 నిర్మాణ యజమానులకు నోటీసులు జారీ చేయడమే




కాకుండా 'మీరు కూల్చేస్తారా? లేదంటే మమ్మల్ని కూల్చేయమంటారా?' అంటూ అల్టిమేటమ్ జారీ చేశారు. చెరువుల కబ్జాలపై సీరియస్‌గా ఉన్న రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయాలకు ఏమాత్రం వెనుకాడటం లేదు. స్వయానా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి ఉంటున్న ఇంటికి నోటీసులను అంటించి షాక్ ఇచ్చారు. తప్పు చేస్తే సోదరుడైనా వదిలేది లేదని రేవంత్ తేల్చి చెప్పారు. మాదాపూర్ అమర్ కో-ఆపరేటివ్ సొసైటీలో తిరుపతి రెడ్డి ఉంటున్న అద్దె ఇల్లు, కార్యాలయం దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు ఆ నోటీసుల్లో స్పష్టం చేశారు. మొత్తానికి చూడబోతే రేవంత్ సర్కార్ ఎవ్వరినీ వదిలేలా కనిపించడం లేదు.




## సీఎం రేవంత్ రెడ్డి సోదరుడికి నోటీసులు

హైదరాబాద్ : చెరువుల కబ్జాలపై తెలంగాణ సర్కార్ ఫోకస్ పెట్టింది. తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి ఉంటున్న ఇంటికి నోటీసులు అందించింది. మాదాపూర్ అమర్ కో-ఆపరేటివ్ సోసైటీలో తిరుపతి రెడ్డి ఉంటున్న అద్దె ఇంటికి, కార్యాలయానికి నోటీసులు అందించారు GHMC అధికారులు. ఆయన ఉంటున్న ఇల్లు దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు రెవెన్యూ అధికారుల గుర్తించారు. కట్టడాలను తొలగించాలని 30 రోజుల గడువు ఇచ్చారు అధికారులు. దుర్గం చెరువుకు ఆనుకున్న ఉన్న నెక్టర్స్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, కావూరిహిల్స్, అమర్ సోసైటీవాసులకు కూడా నోటీసులు ఇచ్చారు. మొత్తం 204 ఇళ్లకు జీహెచ్ఎంసీ అధికారుల నోటీసులు ఇచ్చారు. పలువురు ఐఏఎస్, ఐఆర్ఎస్ అధికారులు, సినీ, రాజకీయ ప్రముఖులకు నోటీసులు ఇచ్చారు. మరోవైపు కూల్చివేతలపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నా కుటుంబ సభ్యులకు ఆక్రమణలున్నాయని, ఎవరైనా ఆధారాలు చూపిస్తే..వాటినీ కూల్చివేస్తాం అని ఆయన అన్నారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డి ఇంటికి నోటీసులు ఇచ్చారు.




# 'పుష్పం' పార్టీలో ఏం జరుగుతోంది!?

## కట్టడి చేయండబ్బా!!

## హైడ్రా కూల్చివేతలపై తలోమాట .. బీజేపీ లో గందరగోళం

హైదరాబాద్ : గత కొద్దిరోజులుగా తెలంగాణలో హైడ్రా పేరు మారుమోగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా చెరువులు ,కొండలను ఆక్రమించి నిర్మించిన భవనాలను కూల్చివేస్తూ హైడ్రా అధికారులు దూకుడు ప్రదర్శిస్తుండడం రాజకీయంగానూ సంచలనంగా మారింది . ఈ కూల్చివేతలలో ఎక్కువగా రాజకీయ పార్టీల నేతలకు సంబంధించిన భవనాలు నిర్మాణాలు ఉండడంతో, ఈ వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. హెచ్ఎండిఏ పరిధిలోని చెరువులు , కొండల పరిరక్షణ లక్ష్యంగా హైడ్రా రంగంలోకి దిగింది. ఎఫ్టిఎల్, బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలను కూల్చివేస్తోంది. ఈ కూల్చివేతల పరంపర ఇంకా కొనసాగుతూ ఉండడంతో అక్రమ నిర్మాణదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. హైడ్రా కూల్చివేతలకు ప్రజల నుంచి, వివిధ రాజకీయ నేతల నుంచి పార్టీలకు అతీతంగా మద్దతు లభిస్తుంది. అయితే ఈ విషయంలో బిజెపిలో మాత్రం గందరగోళ పరిస్థితి నెలకొంది. హైడ్రా కూల్చివేతలను సమర్థించాలా లేక వ్యతిరేకించాలా అనే విషయంలో ఏ క్లారిటీ తెలంగాణ బిజెపి అధిష్టానం నుంచి రాకపోవడంతో ఎవరికి తోచిన విధంగా వారు స్పందిస్తున్నారు. కొంతమంది నేతలు హైడ్రా కూల్చివేతలను బహిరంగంగానే సమర్ధిస్తూ ఉండగా, మరి కొంత మంది వ్యతిరేకిస్తున్నారు. దీంతో అసలు తెలంగాణ బిజెపి వైఖరి ఈ విషయంలో ఏమిటనేది ఎవరికి అంతు పట్టడం లేదు. తెలంగాణ బిజెపిలో 8 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు 8 మంది ఉన్నారు. వీరికి ఏ విషయంలో ఏ విధంగా స్పందించాలనే దానిపై బిజెపి అధిష్టానం ఏ క్లారిటీ ఇవ్వకపోవడంతో, సొంతంగానే తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. దీంతో బిజెపి వైకిరి ఏమిటనేది ఎవరికి క్లారిటీ రావడం లేదు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఈటెల రాజేందర్ హైడ్రా నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తూ మాట్లాడుతున్నారు.

బడా బాబుల కట్టడాలను కూల్చడం సంతోషమేనని, కానీ సామాన్యులను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోబోమని, రేవంత్ హీరోలాగా ఫోజులు కొట్టే పద్ధతి మంచిది కాదు అని విమర్శలు చేస్తున్నారు. అసలు ఆ నిర్మాణాలకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని చెబుతున్నారు. ఇక ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి , రఘునందన్ రావులు బహిరంగంగానే ఈ కూల్చివేతలను సమర్థిస్తున్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ హైదరాబాద్ బిజెపి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన మాధవి లత వంటి వారు సమర్థిస్తున్నారు ఓవైసీ అక్రమ నిర్మాణాలను కూడా కూల్చాలంటూ మాధవి లత డిమాండ్ చేస్తున్నారు . బి జె ఎల్ పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే తాటిపల్లి కూల్చివేతలను సమర్థిస్తూనే, సామాన్యులను ఇబ్బంది పెట్ట వద్దు అంటూ సూచిస్తున్నారు. ఈ విధంగా ఎవరికి వారు హైడ్రా కూల్చివేతలపై స్పందిస్తూ ఉండడంతో, తెలంగాణ బిజెపి నేతలకు సరైన దిశ నిర్దేశం చేసే విషయంలో బిజెపి అధిష్టానం విఫలమైందని , దాని కారణంగానే తెలంగాణలో బిజెపి వెనుకబడుతోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

# సంపాదకీయం

## మోడీ మీద ఉక్రెయిన్ భారం మోపిన అమెరికా

ప్రధానిగా మూడోసారి గెలిచిన తరువాత నరేంద్ర మోడీ రష్యా పర్యటనకు వెళ్లారు. అది కూడా దాదాపుగా అయిదేళ్ల తరువాత. ఇక ఉక్రెయిన్ తో రష్యా యుద్ధం ప్రారంభించిన తరువాత మోడీ రష్యా టూర్ చేయడం ఇదే తొలిసారి. ఇలా ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ పర్యటన సహజంగానే అమెరికాకు కంటగింపుగా మారింది. ఏకధృవ ప్రపంచాన్ని కోరుకుంటున్న అమెరికా ఉక్రెయిన్ వెనక ఉందని అంతా అనుమానిస్తున్న సంగతి తెలిసిందే. రష్యాని దెబ్బ తీయడానికి ప్రచ్ఛన్న యుద్ధానికి తలుపు తెరిచినట్లుగా ప్రచారంలో ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో రష్యా మీద ఒత్తిడి అమెరికా వివిధ రకాలుగా చేస్తూ పోయింది. ఈ పరిణామాల మధ్య భారత తటస్తంగా ఉంటూ వచ్చింది. ఇపుడు ఏకంగా ప్రధాని రష్యా టూర్ పెట్టుకుని దశాబ్దాల భారత్ రష్యా మిత్ర బంధాన్ని మరోసారి చాటారు. మోడీ రష్యా టూర్ మీద అమెరికా సన్నాయి నొక్కులు నొక్కుతూ వచ్చింది. ఇపుడు చూస్తే ఉక్రెయిన్ తో వివాదానికి రష్యా ముగింపు పలికేలా భారత్ ప్రయత్నించి ఒప్పించాలని అమెరికా సూచిస్తోంది. ఉక్రెయిన్‌తో వివాదానికి సంబంధించి తన చట్ట విరుద్ధమైన యుద్ధాన్ని ముగించాలని శాశ్వత శాంతిని కనుగొనాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను భారత్ ఈ విధంగా కోరాలని అమెరికా అంటోంది. ఈ విషయంలో రష్యాతో ఉన్న దీర్ఘకాల సంబంధాన్ని ఉపయోగించుకోవాలని అమెరికా భారతదేశాన్ని కోరింది. అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ దీని మీద మాట్లాడుతూ భారతదేశం రష్యాతో సుదీర్ఘ సంబంధాన్ని కలిగి ఉందని గుర్తు చేశారు. అందుకే రష్యాతో ఆ సంబంధాన్ని ఉపయోగించుకుని ఉక్రెయిన్ సమస్య తీర్చాలని భారతదేశాన్ని కోరుతున్నామని అన్నారు. అదే సమయంలో ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రత సార్వభౌమత్వాన్ని గౌరవించమని ఐక్య రాజ్యసమితి చార్టర్‌ను గౌరవించమని భారతదేశం వ్లాదిమిర్ పుతిన్‌కు చెప్పాలని ఆయన అన్నారు. ఒక విధంగా చూస్తే ఇది సూచనగా ఉన్నా భారత్ ని ఇరికిస్తున్నట్లుగానే ఉంది. రష్యా ఉక్రెయిన్ ల విషయంలో భారత్ ఎపుడూ ఒకే మాట చెబుతూ వస్తోంది. చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని కోరుతోంది. రష్యా తనదైన రక్షణ పరమైన అనుమానాలు భయాందోళనలు వ్యక్తం చేస్తోంది. ఉక్రెయిన్ వెనక ఉన్న శక్తుల గురించే రష్యా కలవరపడుతోంది.

పరిస్థితి ఇలా ఉంటే ఏకపక్షంగా రష్యాను తగ్గమని అడిగే హక్కు ఎవరికైనా ఎలా ఉంటుంది. ముందు ఉక్రెయిన్ కి నాటో దేశాల సాయం నిలుపుదల చేసి చర్చలకు వెళ్లమని పెద్దన్న తానే కోరవచ్చు కదా అన్న మాట కూడా ఉంది. ఏది ఏమైనా భారత్ రష్యా బంధాన్ని దెబ్బ తీయడానికే ఈ ఫిట్టింగ్ ని పెద్దన్న పాత్రలో అగ్ర దేశం పెట్టినట్లుగా ఉందని అంటున్నారు.



## యువత వ్యసనాల వైపు కాక ఆవిష్కరణ వైపు దృష్టి సారించాలి : ఏసీపీ రాములు

### వాలీబాల్ క్రీడా పోటీలను ప్రారంభించిన పెట్ బషీరాబాద్ ఏసిపి రాములు



శామీర్ పేట, (గరుడ వార్త) : యువత వ్యసనాల వైపు కాక, ఆవిష్కరణల వైపు దృష్టిసారిస్తే ఎంతో మందికి ఉపాధి కల్పించగలుగుతారని పేట్ బషీరాబాద్ ఏసిపి రాములు అన్నారు. గురువారం శామీర్ పేట మండలం తుర్కపల్లి లోని సెయింట్ మేరీస్ సెంట్రల్ స్కూల్ లో జీనం వ్యాలీ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో వాలీబాల్ క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రాములు మాట్లాడుతూ యువకులు సన్మార్గంలో ముందుకు సాగుతూ క్రీడల పై దృష్టి సారించాలని సూచించారు. యువకులు క్రీడల పై దృష్టి పెడితే మానసిక ఉల్లాసం కలుగుతుందని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని చెప్పారు. ఈ ఒక్కరోజు జరిగే వాలీబాల్ టోర్నమెంట్లో పోటీలలో 9 టీములు పాల్గొన్నాయని ఏసిపి తెలిపారు. తుర్కపల్లి జీనం వ్యాలీ ఇన్స్పెక్టర్ యాదయ్య గౌడ్ మాట్లాడుతూ యువత క్రీడల్లో రానిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. మాదకద్రవ్యాల వైపు యువకులు వెళ్లకుండా క్రీడలపై దృష్టి సారించాలని చెప్పారు. ఇందులో 9 టీములుగా ఏర్పడి క్రీడల్లో పాల్గొన్నారు. కాగా ఈ పోటీలలో తుర్కపల్లి ఏ టీం ప్రథమ స్థానంలో నిలువగా ద్వితీయ స్థానంలో లాల్ గడి మలక్ పేట బి టీం యువకులు, తృతీయ స్థానంలో తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ పోలీసులు గెలుపొందారు. గెలుపొందిన క్రీడాకారులకు ఏసిపి రాములు చేతుల మీదుగా మెమొంటో ను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మూడు చింతలపల్లి మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, తుంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జయపాల్ రెడ్డి, తుర్కపల్లి గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి, యూసుఫ్ బాబా,ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, యువకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## పల్లె సందర్శన.. పది అంశాల పరిశీలన



ఆలేరు : జిల్లాస్థాయి అధికారులు తరచూ పల్లెలు సందర్శిస్తూ.. తమశాఖలనే కాకుండా.. మరో పది అంశాలను అనుశీలన, పరిశీలన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం ఈ నెల 11న అన్ని జిల్లాల పాలనాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. క్షేత్ర స్థాయిలోని అన్ని ప్రభుత్వ విభాగాలు మరింత పారదర్శకంగా పనిచేయాలన్నదే ఈ కార్యక్రమ లక్ష్యం. సాధారణంగా పల్లెను సందర్శించే ఉన్నతాధికారులు తమకు సంబంధించిన శాఖ వ్యవహారాలను మాత్రమే పరిశీలించి వస్తుంటారు. ఇక నుంచి అలా కాకుండా.. ప్రభుత్వం నిర్దేశించిన మరో పది విషయాలు పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.

ప్రతి నెలా టూర్ డైరీ వివరాలు... జిల్లా పాలనాధికారి ప్రతి నెలా 5వ తేదీలోగా టూర్ డైరీని ప్రభుత్వ కార్యదర్శికి సమర్పించాల్సి ఉంటుంది. అధికారులు పాఠశాలలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలను తరచూ సందర్శిస్తూ ఉంటారు. పాఠశాలల్లో ప్రార్థన సమయానికి, గ్రామాలలో చెత్త తరలింపు విషయాలను ప్రత్యక్షంగా పరిశీలించి తగు సూచనలు ఇవ్వనున్నారు.

సాంఘిక సంక్షేమం:ప్రభుత్వ పరంగా అమలవుతున్న సామాజిక పింఛన్లు, సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు దరిచేరుతున్న తీరు,. సక్రమ పంపిణీ.

గృహ నిర్మాణం:గ్రామంలో ప్రభుత్వ పరం గా ఇంటి నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వ పరంగా అందుతున్న సాయం..

రహదారులు మౌలిక వసతులు:గ్రామంలో రహదారుల పరిస్థితి, రవాణా సౌకర్యాలు.

పురపాలన:శానిటేషన్ పనులు, తాగునీటి సరఫరా, పట్టణ ప్రణాళిక.

నీటి సరఫరా, పారిశుద్ధ్యం:గ్రామాలలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య చర్యలు, టాయిలెట్ల, మరుగుదొడ్ల నిర్వహణ.

మహిళా, శిశు సంక్షేమం:మహిళలు, శిశు సంక్షేమం కోసం అమలులో ఉన్న సంక్షేమ పథకాల అమలు తీరు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ వసతి గృహాల పనితీరు.

విద్య:గ్రామస్థాయిలో పాఠశాలల సందర్శన, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, బోధన, విద్యార్థుల సామర్థ్యాల ప్రగతి.

వ్యవసాయం:గ్రామాలలో రైతులకు అందుతున్న విత్తనాలు, ఎరువులు, పంటల సాగు, దిగుబడుల అంచనాలు.

ప్రజా పంపిణీ:గ్రామంలో ప్రజలకు ప్రభుత్వ చౌకదుకాణాల ద్వారా అందుతున్న రాయితీ సరకుల పంపిణీ తీరు.

వైద్య సౌకర్యాలు:పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, సబ్‌సెంటర్ల పనితీరు, వీటి ద్వారా ప్రజలకు అందుతున్న వైద్యసేవలు, వసతులు, వైద్యులు, సిబ్బంది పనితీరు, ఖాళీలు.




**విజయవాడ: మాతృభాషలో అధ్యయనం చేస్తేనే విజ్ఞానం వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు. "భాషను మరిచిపోతే.. జాతి కనుమరుగు అవుతుంది. కూచిపూడి తెలుగుజాతి వారసత్వ సంపద. కూచిపూడిని కాపాడే బాధ్యతను తీసుకుంటా. పరిజ్ఞానం రావాలంటే మాతృభాషలో ప్రాథమిక విద్య కొనసాగాలి. ఆంగ్లం నేర్చుకుంటేనే జీవితం ఉందంటూ గత ప్రభుత్వ నేతలు మాట్లాడారు. భాష అనేది కమ్యూనికేషన్ మాత్రమే. తెలుగు భాషను కాపాడతామని హామీ ఇస్తున్నా. జీతం కోసం ఆంగ్లం.. జీవితం కోసం తెలుగు నేర్పిస్తాం. 2047 నాటికి దేశంలోనే ఏపీ ప్రథమస్థానంలో ఉండాలని కృషి చేస్తున్నాం. నేను తెలుగు వాడిని అని గర్వంగా చెప్పే రోజు వస్తుంది. జీవో నెంబరు 77పై అధ్యయనం చేస్తాం" అని సీఎం తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.**

## బతికేలా నాటేద్దాం.. భవిత మారుద్దాం

సూర్యాపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవం ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఎనిమిది విడతలుగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో లక్షలాది మొక్కలు నాటిన విషయం తెలిసిందే. ఈ సంవత్సరం వన మహోత్సవం పేరిట నాటే ప్రతి మొక్క బతికించే బాధ్యతను ప్రభుత్వం అధికారులకు అప్పగించింది. ఈ సారి మండలాలకు లక్ష్యాలను తక్కువగానే ఇచ్చారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు సమన్వయంతో స్థలాలను పరిశీలించి మొక్కలు నాటేందుకు అనువుగా ఉన్న వాటిని గుర్తించారు. నర్సరీల్లో అవసరమైన మొక్కలను సిద్ధం చేశారు. యాదాద్రి భువనగిరిలో సోమవారం ఈ కార్యక్రమం ప్రారంభమైంది. సూర్యాపేటలో ఈ నెల 18న, నల్గొండలో వారం రోజుల్లో అధికారికంగా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేపడుతున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటుతున్నారు.

లోపాలను అధిగమిస్తేనే పచ్చదనం

గతంలో ఖాళీ స్థలాల్లో, ప్లాట్ల ముందు, విద్యుత్తు తీగల కింద మొక్కలు నాటించారు. దీంతో మొక్కలు నాటే లక్ష్యం చేరినా.. ఫలవంతం కాని పరిస్థితి. ప్లాట్ల ముందువారు ఆదిలోనే తొలగించగా, విద్యుత్తు తీగల కింద నాటినవి ఏపుగా పెరిగిన తర్వాత



తీగలకు అడ్డొస్తున్నాయని ఆ శాఖ అధికారులు కొట్టేస్తున్నారు. ఈ సారి వీటి నుంచి బయట పడేందుకు ముందుగానే ఏపీవోలు, సాంకేతిక సిబ్బంది, ఈసీలు, క్షేత్ర సహాయకులు, కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించి స్థలాలను ఎంపిక చేశారు. ఎన్ని మొక్కలు నాటవచ్చో ఆ వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. ఈసారి ఇళ్లల్లో, గట్లపై, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు స్థలాల్లో, గతంలో ఎండిన చోట, విద్యుత్తు తీగల కింద మొక్కలు నాటడం లేదు.

లక్ష్యం మేరకు సన్నద్ధం:సతీష్, డీఎఫ్‌వో, సూర్యాపేట

వన మహోత్సవంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు అన్ని మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నర్సరీల్లో లేని మొక్కలను బయట నుంచి తెప్పిస్తున్నాం. వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యాలకు సరిపోయే విధంగా నర్సరీల్లో సిద్ధం చేస్తున్నాం. పండ్లు, పూలు, ఇతర మొక్కలు ఉండేలా చూసుకుంటున్నాం.

నాటుతున్న మొక్కలివి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖలకు 130.95 లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. వర్షాలు కురుస్తుండటంతో ఇప్పటికే 41.25 లక్షల మొక్కలు నాటారు. వన మహోత్సవంలో పండ్ల, నీడనిచ్చే మొక్కలు ప్రాధాన్యం ఇచ్చేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ప్రధానంగా స్థానిక వాతావరణానికి అనుకూలంగా పెరిగే వాటిని ఎంపిక చేసుకున్నారు. గుర్తించిన స్థలాల్లోనే వాటిని నాటేలా సన్నాహాలు చేపడుతున్నారు.

## మిల్లుల్లో ధాన్యం ఉందా..?

కామారెడ్డి : ప్రభుత్వం రైస్‌మిల్లులకు ప్రతి ఏడాది వానాకాలం, యాసంగి సీజన్లలో ధాన్యాన్ని అందిస్తుంది. మిల్లులతో ఒప్పందం కుదుర్చుకుని బియ్యాన్ని తీసుకుంటుంది. అయితే కొందరు మిల్లర్లు ధాన్యాన్ని సొంత అవసరాలకు వాడుకుని నిల్వలు లేకుండా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. రెండు మిల్లులపై కేసులు కూడా నమోదు చేశారు. ఇవే కాకుండా మరికొందరు మిల్లర్లు కూడా ధాన్యాన్ని మాయం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాలనాధికారి రంగంలోకి దిగారు. అన్ని మిల్లులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం వారివద్ద ఉందో లేదో చూడాలని ఆదేశించారు. ఒకవేళ మిల్లుల్లో ధాన్యం లేకుంటే సదరు యజమానికి తాఖీదులు జారీ చేయాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారి ఆదేశాలతో క్షేత్రస్థాయి తనిఖీలకు పౌరసరఫరాలశాఖ అధికారులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

**మూడు సీజన్ల నుంచి..**

ప్రభుత్వం నుంచి తీసుకున్న మూడు సీజన్ల ధాన్యం ప్రస్తుతం మిల్లుల్లో ఉంది. ఇందులో 2022-23 ఏడాదికి సంబంధించిన యాసంగి సీజన్ ధాన్యానికి అప్పటి ప్రభుత్వం గ్లోబల్ టెండర్లు ఆహ్వానించింది. టెండర్ నిర్వాహకులు మొన్నటి వరకు ధాన్యాన్ని తీసుకువెళ్లలేదు. అది మిల్లుల్లోనే మూలుగుతోంది. గ్లోబల్ టెండర్ నిర్వాహకులు ఆయా మిల్లుల నుంచి ధాన్యాన్ని తీసుకువెళ్లడం ఖర్చుతో కూడిన పనిగా భావించినట్లు తెలుస్తోంది. అందుకే ఎవరి మిల్లుల్లో ఎంత ధాన్యాన్ని టెండర్‌లో దక్కించుకున్నారో ఆ ధాన్యాన్ని అదే మిల్లు యజమానికి ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. జిల్లాలో కొందరు మిల్లర్లు ఆ ధాన్యానికి డబ్బులు కూడా చెల్లిస్తున్నారు. అయితే గ్లోబల్ టెండర్ వారు దక్కించుకున్న ధాన్యాన్ని కొందరు మిల్లర్లు పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ వారు ఇటీవల జిల్లాలోని భిక్కనూరు, పల్వంచ, సదాశివనగర్ మండలాల్లోని మూడు మిల్లుల్లో తనిఖీ చేసి నివేదిక రూపొందించారు. ఇది కాకుండా 2022-23 వానాకాలం సీజన్, 2023-24 యాసంగి సీజన్ ధాన్యం మిల్లుల్లో ఉంది. ఈ నిల్వలు సరిగా ఉన్నాయో లేదో తనిఖీల్లో వెల్లడికానుంది.

**నోటీసుల జారీ..**

2021-22 వార్షిక ఏడాదిలో 31 మంది మిల్లర్లు లక్ష్యం మేర బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వకపోవడంతో అధికారులు నోటీసులు జారీ చేశారు. 2022-23 ఏడాదిలో కూడా 36 మంది మిల్లర్లకు నోటీసులు జారీ అయ్యాయి. కొందరు మిల్లర్లు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లుగా తెలుస్తోంది. రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి తిరిగి ప్రభుత్వానికి సీఎంఆర్‌గా అందజేస్తున్నారు. ప్రస్తుతం అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తే ఎంత మంది వద్ద ధాన్యం నిల్వలు ఉంది లేనిది బహిర్గతమవుతుంది.

## అనగనగా అక్కడో చెరువుండే

హైదరాబాద్ : నగరంలోని చెరువులు అత్యవసర పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఆక్రమణకు గురై కుంచించుకుపోతున్నాయి. కొన్నాళ్లయితే పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదమూ ఉంది. ఈ నేపథ్యంలో హైడ్రాపైనే జనం ఆశలు పెట్టుకున్నారు. అక్టోబరు, 2020లో కురిసిన వర్షాలకు నగరంలోని ఐదు లక్షల కుటుంబాలు నెల రోజులపాటు ముంపును ఎదుర్కొన్నాయి. అనంతరం జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లు, కంటోన్మెంట్ పరిధి, పలు కేంద్ర ప్రభుత్వ సంస్థల పరిధిలో చేపట్టిన అధ్యయనం ప్రకారం తటాకాల లోపల దాదాపు 15 వేల ఆక్రమణలు ఉన్నట్లు లెక్క తేలాయి.

గత నాలుగేళ్లలో మరో 5వేల ఆక్రమణలు ఉండొచ్చని అంచనా. మరో పదేళ్లలో అన్నీ చెరువులు కనిపించకుండా పోయే ప్రమాదము ందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆ నగరాలే ఆదర్శం.. బెంగళూరులో చెరువులను ఆక్రమణల నుంచి విడిపించి, పునరుజ్జీవం కల్పించే చర్యలు జరుగుతున్నాయి. చెన్నైలో



ఉపగ్రహ చిత్రాలతో ఆక్రమణలను గుర్తించే వ్యవస్థను తీసుకొచ్చారు. వాటిలోని ఉత్తమ విధానాలను అందిపుచ్చుకుని చెరువులను రక్షిస్తామని హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ చెబుతున్నారు.

ఇప్పటికీ కబ్జాలే..148 ఎకరాల మూసాపేట మైసమ్మ చెరువులో 58 ఎకరాలు ఆక్రమించారు. మరో పది ఎకరాల్లో సెల్లారు మట్టితో పూడ్చారు. హైటెక్‌సిటీ ఎన్ఐఏ రోడ్డులో 7 ఎకరాల విస్తీర్ణంతో ఉన్న తమ్మిడికుంట కనిపించడం లేదు. కాముని చెరువు, ఐడీఎల్ చెరువు పదెకరాల మేర, సున్నం చెరువు సగం మేర ఆక్రమించారు.

జీహెచ్ఎంసీ సైతం లింకు రోడ్డు పేరుతో చెరువు మధ్యలో 100 అడుగుల రోడ్డు నిర్మించగా.. కొందరు రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు నిర్మించారు. కాటేదాన్, రాజేంద్రనగర్, గాజులరామారం, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ప్రాంతాల్లో ఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయి.

## దశాబ్దాల మరక మార్పు కానరాక

హైదరాబాద్ : మత్తు దందా ఎక్కువ సాగే ప్రాంతం ఏది అంటే చాలామంది ధూల్‌పేట అని టక్కున సమాధానం చెబుతారు. ఈ మరకను తొలగించడానికి పోలీసులు, ఆబ్కారీ శాఖ ఆపరేషన్ ధూల్‌పేట కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ఆబ్కారీ, పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకున్నారు. ఈ నెలాఖరు నాటికి పూర్తిగా గంజాయి దందా తుద ముట్టించడానికి కంకణం కట్టుకున్నారు.

చిక్కని అసలు వ్యక్తులు

ఇప్పటి వరకు 54 మందిని అరెస్టు చేశారు. మరో 53 మంది గంజాయి విక్రేతలు పరారీలో ఉన్నారు. ధూల్‌పేటకు గంజాయి చేర్చడంలో ప్రముఖంగా వ్యవహరించే వారిలో (ఒకరు మహిళ) ఇంకా చిక్కలేదు.

ఇది సరిపోదు..: ఆపరేషన్ ధూల్‌పేటతో నిందితులు అప్రమత్తమయ్యారు. అప్పటివరకు స్థానికంగా ఉండకుండా..వ్యాపారం చేయకుండా ఉండి.. ఆ తర్వాత మొదలెడుదామనే వ్యూహం స్పష్టంగా



కనిపిస్తోంది. ఈ విషయం అధికారులకు తెలిసినా ఆబ్కారీ పోలీసుల ప్రణాళిక పక్కాగా ఉన్నట్టు కనిపించడం లేదు.

ఇలాగైతే ఎలా..!ధూల్‌పేట ఆబ్కారీ స్టేషన్‌లో ముగ్గురు సీఐలకు ఇద్దరే ఉన్నారు. ఒకరికి పోస్టింగ్ ఇచ్చినా విధుల్లో చేరలేదు.

11 మంది ఎస్సైల్లో ఐదుగురు సెలవు పెట్టారు.

18 మంది కానిస్టేబుళ్లలో ముగ్గురు మహిళలు. 15 మందిలో ఇద్దరు ఎక్సైజ్ అకాడమీలో ఉన్నారు.

ఈ నెల 19 వరకు 99 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

## ఖర్చులన్నీ కట్టాల్సిందే

హైదరాబాద్ : రాజధానిలో చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పడిన హైడ్రా సరికొత్త ఎత్తుగడతో ముందుకు వెళ్తోంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని అక్రమ నిర్మాణాలతో ప్రభుత్వానికి కలిగిన నష్టాన్ని నిర్మాణదారుల నుంచే వసూలు చేయాలనుకుంటోంది.

నిర్మాణ వ్యర్థాల తరలింపులో సవాలు.. హైడ్రా అధికారులు ఇప్పటికే 18 చోట్ల 166 నిర్మాణాలను నేలమట్టం చేశారు. కట్టడాలు కూల్చడంతో నిర్మాణ వ్యర్థాలు భారీగా పోగుపడుతున్నాయి. వీటిని తరలించడానికి రూ.కోట్లలోనే ఖర్చయ్యే అవకాశం ఉంది. కూల్చిన చెరువుల దగ్గర ఫెన్సింగ్ వేస్తేనే తిరిగి ఆక్రమణలు జరగవని స్థానికులు చెబుతున్నారు. కుంచించుకుపోయిన వాటిని పునరిద్ధరించాలంటే తవ్వకాలు జరిపి పూర్వ ఆకారాన్ని తీసుకురావాల్సి ఉంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో హైడ్రా దగ్గర ఆ స్థాయిలో నిధుల్లేవు. ప్రస్తుతం కూల్చిన 166 నిర్మాణ వ్యర్థాలను తొలగించడానికి ఏర్పాట్లు చేసినట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. కూల్చివేతకు ఇచ్చిన కాంట్రాక్టులో శిథిలాల తొలగింపు ఒక భాగంగా చేశామని తెలిపారు. ఆర్ఆర్ చట్టం కింద ఈ మొత్తం వ్యయాన్ని నిర్మాణదారుల దగ్గరే వసూలు చేసేలే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. మాదాపూర్‌లోని ఎన్‌కన్వెన్షన్‌ను రెండు రోజుల కిందట కూల్చివేసిన విషయం తెలిసిందే. ఇక్కడ దాదాపు చిన్నా పెద్దా పది నిర్మాణాలు ఉన్నాయి. వీటిని కూల్చివేయడానికి భారీ యంత్రాలను వినియోగించారు. ఇప్పుడు ఇక్కడి నుంచి ఇనుప వస్తువులతో నిండి ఉన్న శిథిలాలను తొలగించడం కత్తి మీద సాములా మారింది.

# సీఎంఆర్ ధాన్యం ఏమైంది?



హుజూరాబాద్: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద ధాన్యాన్ని మరాడించి బియ్యాన్ని తిరిగి అప్పగించడంలో కొందరు మిల్లర్లు ముప్పు తిప్పలు పెడుతున్నారు. బియ్యమైనా తిరిగి ఇవ్వండి.. లేదా దానికి సరిపడా డబ్బులైనా చెల్లించాలని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా.. మిల్లర్లకు నోటీసులు జారీ చేస్తున్నా.. 2021-22లో బకాయి అప్పగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

1,31,262 క్వింటాళ్ల బియ్యం బకాయి

జిల్లాలో 2020-21 వానాకాలం, యాసంగి సీజన్లలో సుమారు 7,03,508 మెట్రిక్ టన్నుల ధాన్యం సీఎంఆర్ కింద కేటాయించారు. ధాన్యాన్ని మరాడించి ముడి బియ్యం క్వింటాకు 67 కిలోలు, బాయిల్డ్ బియ్యం క్వింటాకు 68 కిలోల చొప్పున తిరిగివ్వాలి కానీ.. నాలుగేళు పూర్తయినా ఆశించిన ప్రగతి లేదు. జిల్లాలో 58 మంది మిల్లర్లు తమకు కేటాయించిన 16,25,236 క్వింటాళ్ల ధాన్యాన్ని మరాడించి 10,81,900 క్వింటాళ్ల బియ్యం తిరిగివ్వాల్సి ఉంది. ఇప్పటివరకు 3,49,950 క్వింటాళ్ల బియ్యం మిల్లర్ల వద్దే ఉండిపోవడంతో పౌరసరఫరాల సంస్థ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. స్పందించకపోవడంతో 25 శాతం జరిమానాతో కలిపి 4,37,438 క్వింటాళ్ల బియ్యం తిరిగివ్వాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. పలువురు మిల్లర్లు 3,06,176 క్వింటాళ్ల బియ్యాన్ని 100 శాతం తిరిగి అప్పగించారు. ఇంకా 43,774 క్వింటాళ్ల బియ్యం ఇవ్వాల్సి ఉంది. దీనికి 25 శాతం జరిమానాతో కలిపితే 1,31,262 క్వింటాళ్ల బియ్యం ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. జిల్లాలో సీఎంఆర్ బకాయి పడిన వారిలో 58 మంది మిల్లర్లు ఉన్నారు. వీరందరిని డిఫాల్టర్లుగా అధికారులు గుర్తించినా ఇందులో కొందరికి ఆ తర్వాతి సీజన్ల సీఎంఆర్ ధాన్యం కేటాయించడం గమనార్హం.

**మిల్లుల్లో నిల్వలేవీ?**

ఒక సీజన్‌లో సీఎంఆర్ కింద తీసుకున్న ధాన్యాన్ని మరాడించి మరో సీజన్ ధాన్యం వచ్చే సమయానికి కంటే ముందే బియ్యం తిరిగి అప్పగించాలి. 2021-22 వానాకాలం, యాసంగి సీజన్‌లు ముగిసి నాలుగేళ్లు పూర్తయినా వేలాది క్వింటాళ్ల బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి అప్పగించడంలో మొండికేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం మిల్లర్ల వద్ద ధాన్యం లేకపోవడమే.. ఈ మేరకు హుజూరాబాద్‌కు చెందిన సత్యనారాయణ అనే వ్యాపారి మిల్లును లీజుకు తీసుకొని 2021-22 వానాకాలం సీజన్‌లో 3,870 క్వింటాళ్ల ధాన్యం, 2022-23 వానాకాలంలో 3,445 క్వింటాళ్ల ధాన్యం కేటాయించగా మొత్తంగా రూ.2.50 కోట్ల విలువైన 5,753 క్వింటాళ్ల ధాన్యం మాయం చేశాడు. ఈ మేరకు కేసు కూడా నమోదు చేశారు. లీజుకు తీసుకున్న వ్యాపారి ఆచూకీ లేకపోవడంతో మిల్లు యజమాని సమ్మిరెడ్డికి నోటీసులు జారీ చేయడంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. లా 2021-22లో సీఎంఆర్ ధాన్యం తీసుకున్న మిల్లర్లు మరాడించిన బియ్యాన్ని అమ్ముకొని సొమ్ము చేసుకోవడం వల్లే నాలుగేళ్లు దాటినా బకాయిలు తిరిగివ్వడం లేదని తెలుస్తోంది.

**యథేచ్ఛగా పక్కదారి..**

గత డిసెంబరులో టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంటలోని ఆరు మిల్లులను తనిఖీ చేశారు. 2022-23 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి సీఎంఆర్ కింద 5.41 లక్షల క్వింటాళ్ల ధాన్యం కేటాయించగా 2.66 లక్షల క్వింటాళ్ల ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.52.13 కోట్లు పైగానే ఉంటుంది. నిరంతరం తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే మిల్లుల్లోని సీఎంఆర్ ధాన్యం పక్కదారి పడుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదే అదనుగా మిల్లర్లు సీఎంఆర్ ధాన్యాన్ని యథేచ్ఛగా పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నారు.

# అతివలకు ఆర్థిక భరోసా



వికారాబాద్ : ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే అతివల కోసం ప్రత్యేకంగా 'ఇందిరా మహిళా శక్తి' పథకాన్ని ప్రారంభించింది. దీంతో మహిళలు అభివృద్ధి చెందడంతో పాటు మరో పది మందికి ఉపాధి కల్పించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టింది. రుణాలు సైతం అందజేయనుంది.

క్యాంటీన్లు 6

జిల్లాలోని నాలుగు పురపాలికల్లో 6 మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నారు. వికారాబాద్‌లో కలెక్టర్ కార్యాలయం, జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాలలో ఏర్పాటుకు నిర్ణయించారు. తాండూరులో జిల్లా ఆసుపత్రి, మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో, పరిగిలో పురపాలక కార్యాలయం ఆవరణలో, కొడంగల్‌లో బస్‌స్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేయనున్నారు. మహిళా సంఘాలకు అవసరమైన బ్యాంకు రుణాలను ఇప్పిస్తారు. వచ్చే నెలలో ప్రారంభించడానికి అధికారులు సిద్ధం అవుతున్నారు.

కుట్టులో శిక్షణ

జిల్లాలోని నాలుగు పురపాలిక సంఘాల్లో ఒక్కో కుట్టు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. వికారాబాద్, తాండూరులో ఇవి పనిచేయటం ప్రారంభించాయి. కొడంగల్‌లో కమ్యూనిటీ హాల్‌లో, పరిగిలో పాత రోడ్లు భవనాల శాఖ భవనంలో ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రాల్లో పాఠశాలలు, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు అవసరమైన దుస్తులు కుడతారు. అంతేకాకుండా ఇక్కడ మహిళా సంఘాల సభ్యులకు కుట్టు పనుల్లో శిక్షణ ఇస్తారు.

జిల్లా స్థాయి ఎంటర్‌ప్రైజెస్‌లు..

జిల్లా స్థాయిలో 26 సంఘాల ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రైజెస్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు గాను రూ.5.25 కోట్లు రుణాలు ఇప్పిస్తారు. వికారాబాద్‌లో 9, తాండూరులో 11, కొడంగల్‌లో 2, పరిగిలో 4 ఏర్పాటు చేస్తారు. గ్రూపు సభ్యులకే కాకుండా వ్యక్తిగతంగా అభివృద్ధి చెందటానికి 149 యూనిట్లకు రూ.5.21 కోట్లు రుణం ఇప్పిస్తారు.

జిల్లాలో పట్టణ మహిళా సహాయ సంఘాలు: 2,488

సభ్యులు: 25 వేలు

లక్ష్యం: 548 సంఘాలకు రూ.35 కోట్లు

ఇప్పటి వరకు మంజూరు: 250 సంఘాలకు రూ.19 కోట్లు

ప్రాంతీయ మహిళా సంఘాలు: 106

నిరుపేద మహిళల కోసమే..

జిల్లాలో మెప్మా ఆధ్వర్యంలో నిరుపేద మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నాం. మహిళా రైతులు పండించిన కూరగాయలు చెడిపోకుండా వికారాబాద్‌లో శీతల గిడ్డంగి నిర్మిస్తాం. గృహ సేవకులను నియమించనున్నాం. కార్మిక అడ్డాలను ఏర్పాటు చేస్తాం.

రవికుమార్, మెప్మా జిల్లా అధికారి, వికారాబాద్.

# మట్టి రోడ్లకు మహర్దశ

కొడంగల్: పల్లెల్లో మట్టి రోడ్లకు మోక్షం లభించనుంది. బీటీగా మార్చడానికి యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది. పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో సీఆర్ఆర్ నిధులతో చేపట్టే కొన్ని రోడ్లకు టెండర్లు పూర్తయ్యాయి. కొన్నింటి పనులు సైతం ప్రారంభం అయ్యాయి. నియోజకవర్గంలోని కొడంగల్ మండలంలో 12.5 కిలోమీటర్ల రోడ్లకు సంబంధించి రూ.28 కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నారు.

శాశ్వత పరిష్కారం దిశగా..

కొడంగల్ మండలంలోని సంగాయిపల్లి నుంచి లక్ష్మీపల్లి దూరం 1.5 కి.మీ. ఎన్నో ఏళ్లుగా సరైన రోడ్డు లేక సంగాయిపల్లి నుంచి లక్ష్మీపల్లికి వెళ్లేందుకు ఆయా గ్రామాల వాసులు 6 కి.మీ. దూరం ప్రయాణిస్తున్నారు. ప్రస్తుతం రూ.4.40 కోట్ల నిధులు మంజూరై పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రెండు గ్రామాలకు మధ్య వాగు ఉండటంతో వంతెన పనులు ముందుగా చేపట్టారు.

చిట్లపల్లి నుంచి ఖాజాఅహ్మద్‌పల్లి మధ్య కొంత దూరం బీటీగా మారినామరో కిలోమీటర్ దూరం పనులు జరగాల్సి ఉంది. ఇందుకు రూ.1.30 కోట్ల నిధులు కేటాయించారు. టెండర్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

తగ్గనున్న 22 కిలోమీటర్లు

కొడంగల్ మండలంలోనే అతి పెద్ద పంచాయతీగా ఉన్న రుద్రారం నుంచి తాండూరు వెళ్లేందుకు దాదాపు 42 కి.మీ. దూరం ప్రయాణిస్తున్నారు. ఇక్కడ రోడ్డు వేయాలని 10 గ్రామాలకు చెందిన



ప్రజలు 40 ఏళ్లుగా కోరుతున్నారు. ప్రస్తుతం పాటీమీది పల్లి నుంచి గోటికే కలాన్ వరకు పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో 10 కిలోమీటర్ల దూరానికి సంబంధించి రూ.22 కోట్ల నిధులు కేటాయించారు. టెండర్లు పూర్తి కావడంతో పాటు ఈ వారంలో పనులు చేపట్టనున్నారు. పాటీమీదిపల్లి మీదుగా రోడ్డు పూర్తయితే రుద్రారం నుంచి తాండూరుకు కేవలం 20 కి.మీ దూరం ఉంటుంది. 22 కి.మీ దూరం తగ్గ నుంది.

# డెంగీ కలవరం

మహేశ్వరం : డెంగీ జ్వరాలు రాజధానిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (బల్దియా) దోమల నివారణలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుండటంతో కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నాయి. నీలోఫర్‌లో పదిహేను మంది చిన్నారులు ప్రమాదకర పరిస్థితుల్లో చికిత్స పొందుతుండగా గాంధీ, ఉస్మానియాతో పాటు మిగిలిన ఆస్పత్రుల్లోనూ డెంగీ బాధితులు ఎక్కువే ఉన్నారు. ప్రమాదకర ఘంటికలు.. గ్రేటర్‌లో మొత్తం 4,646 కాలనీలు ఉండగా అందులోని వెయ్యి కాలనీల్లో ప్రమాద ఘంటికలు మోగిస్తున్నా



యి. దోమల నివారణ చర్యల్లో జీహెచ్ఎంసీ వైఫల్యమే అందుకు కారణం. వైద్య ఆరోగ్యశాఖ, జీహెచ్ఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 15 వరకు నగరంలోని 108 డివిజన్లలో 456 వైద్య శిబిరాలు నిర్వహించారు. ఎక్కువ గా డెంగీ బాధితులున్న 404 కాలనీలను గుర్తించారు. వాటిలో ఒకరికి మలేరియా జ్వరం, 731 మందికి డెంగీ ఉన్నట్టు తేలింది.

జీహెచ్ఎంసీ భిన్న ప్రకటన.. ఈ నెలలో పది రోజులపాటు చేపట్టిన వైద్య శిబిరాల్లో 731 మందికి డెంగీ ఉన్నట్టు తేలగా, బల్దియా మాత్రం ఈ నెలలో 378 మందికి మాత్రమే ఉన్నట్టు లెక్కలు చూపుతోంది.

అమాత్యుడు చెప్పినా.. బాపూఘాట్ నుంచి అత్తాపూర్ వంతెన వరకు మూసీ నదిలో పెద్దఎత్తున గుర్రపు డెక్క పేరుకుపోయింది. మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ప్రాంతంలోనే ఉంటారు. చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నకు జూపల్లికి నెల రోజుల కిందట ఫోన్ చేసి తక్షణం మూసీలో గుర్రపు డెక్కను తొలగించమని ఆదేశించి ఇప్పటివరకు పూర్తి చేయలేదు. ఈ పనులను పర్యవేక్షించాల్సిన బల్దియా ఇంజనీర్ నరేందర్ గౌడ్ ఈ వైపు కన్నెత్తి చూడటం లేదు. ఈ ఒక్క జోన్‌లోనే కాదు జోనల్, డిప్యూటీ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదు.

## మూడు గంటల్లోనే డెంగీ పరీక్ష

వికారాబాద్ : జిల్లాలో జ్వరాలు ముప్పెట దాడి చేస్తున్నాయి. ముఖ్యంగా డెంగీ ఆందోళన కలిగిస్తోంది. మూడు నెలలుగా 4998 డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే 119 పాజిటివ్ అని తేలడంతో ఆ మేరకు వైద్యశాఖ అప్రమత్తంగా ఉంది. ఎప్పటికప్పుడు వేగంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. బయట ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకుంటే రూ.800 వరకు వసూలు చేస్తున్నారు. ఇక్కడే చేయించుకుంటే పేదలకు ఖర్చు కూడా తగ్గుతుంది. వికారాబాద్ జిల్లా కేంద్రంలో రూ.3.50 కోట్లతో రోగ నిర్ధారణ పరీక్షా కేంద్రం(టీహబ్) చేపట్టి మూడేళ్ల క్రితం ప్రారంభించారు. ఫలితాలు బాగా రావడంతో అనుబంధంగా రేడియాల జీ, పాథాలజీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో గతంలో కేవలం 57 రకాల పరీక్షలు మాత్రమే చేసేవారు. ప్రస్తుతం 87 రకాల పరీక్షలు చేస్తున్నారు. ముమ్ముందు 154 పరీక్షలు జరపనున్నారు.



40 ఆసుపత్రుల నుంచి

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు అవసరమైన డెంగీ పరీక్షలు ఈ హబ్‌లో చేస్తున్నారు. నిర్ధారణ కోసం ప్రత్యేకంగా 'ఎలీసా' పరీక్షలు జరుపుతున్నారు. ఒకేసారి 100 నుంచి ఆపై నమూనాలను పరీక్షిస్తున్నారు. ఈ పరీక్ష పూర్తి కావడానికి సుమారు 3 గంటల సమయం పడుతుంది. మొత్తం 40 ఆసుపత్రుల నుంచి నమూనాలు పంపిస్తున్నారు. జిల్లాలోని 31 ఆసుపత్రులతో పాటు రంగారెడ్డి జిల్లాలోని 9 ఆసుపత్రుల నుంచి నమూనాలు వస్తున్నాయి. నమూనాల సేకరణకు 6 రూట్లకు గాను 6 వాహనాలున్నాయి.

## సర్కారు భూమిలో స్థిరాస్తి వ్యాపారం

మహేశ్వరం : అదో ప్రభుత్వ భూమి. రైతులు పంటలు పండించేందుకు, పండిన పంటను రవాణా చేసేందుకు బండి బాట ఉంది. సమీపంలో స్థిరాస్తి వ్యాపారి ఒకరు వెంచర్ నిర్మాణాన్ని చేపట్టారు. ప్రభుత్వ భూమి నుంచి తారు రోడ్డు నిర్మించి ప్లాట్లు విక్రయిస్తున్నారు. మరోవైపు 7.59 ఎకరాల తుమ్మలకుంట చెరువును స్థిరాస్తి వ్యాపారి మాయం చేశారు. వెంచర్‌లో కలిపిన ప్లాట్లుగా చేసి అమ్మేశారు. తుక్కుగూడ పరిధిలో ఆక్రమణల తీరిది..మహేశ్వరం మండలం మంఖాల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 131లో 60 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 15 ఎకరాలు రెండు పడక గదుల ఇళ్లు, విద్యుత్తు ఉప కేంద్రానికి కేటాయించగా మిగిలిన భూమిలో దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్నారు. పక్కనే ఓ స్థిరాస్తి వ్యాపారి 30 ఎకరాల్లో భారీ వెంచర్ వేశారు. ఇందులోకి దారి లేక అతని కన్ను ప్రభుత్వ భూమిపై పడింది. బండిబాటను తారు రోడ్డుగా మార్చేశారు. స్థానిక నేతల అండతో రూ.5 కోట్ల విలువైన ఎకరా భూమిలో 40 అడుగుల రోడ్డు నిర్మించారు. వాస్తవానికి వెంచర్ వేసిన భూముల్లో గతంలో తుమ్మలకుంట చెరువు ఉండేది. నీటిపారుదల శాఖ లెక్కల ప్రకారం చెరువు 7.59 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీని కింద 18 ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు రికార్డులో నమోదైంది. పట్టా భూముల్లో చెరువు ఉందన్న కారణంతో దాన్ని నామ రూపాలు లేకుండా చేసి ప్లాట్లు చేశారు. వాల్టా చట్టం ప్రకారం ఏదైనా నీటివనరు పట్టా భూముల్లో ఉంటే దాని స్వరూపాన్ని మార్చకూడదు. కేవలం నీరు లేనప్పుడు వ్యవసాయ అవసరాలకు మాత్రమే వినియోగించాలి. దీన్ని పట్టించుకోకుండా చెరువును పూర్తిగా పూడ్చివేశారు.

# యంత్రాల వినియోగం ఎంత?

సారంగాపూర్: ఇటీవల వర్షాలతోపాటు జిల్లాలో పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. దోమల నియంత్రణతోపాటు తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించేందుకు పంచాయతీలకు అందించిన పరికరాలు నిరుపయో గంగా మారాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.50 లక్షలు వ్యయం చేసి పిచికారీ యంత్రాలతోపాటు చేసే దోమల నివారణ మందులను పంచాయతీలకు అందించారు. ప్రస్తుతం గ్రామాల్లో దోమల తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ ఫాగింగ్ చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

**తాగునీటి నాణ్యత పరీక్ష కిట్లు ఎక్కడ?**

మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ నీటి సరఫరా లేకపోవడంతో స్థానికంగా బోర్లు, బావుల ద్వారానే నీటిని అందిస్తున్నారు. తరచూ గేట్‌వాల్వులు, పైపులైన్ల లీకేజీలతో పాటు మంచినీటి ట్యాంకులలో అపరిశుభ్రతతో నీరు కలుషితమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో నీటి నాణ్యతను పరీక్షించేందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా క్లోరో స్కోప్(తాగు నీటి నాణ్యత)కిట్లను పంచాయతీలకు



అందించారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ పంచాయతీలు పరీక్షలు నిర్వహించడం లేదు. అంతేకాకుండా కనీసం రక్షిత మంచినీటి బావులు, ట్యాంకులు, ఇళ్లలోని బావులలోనూ క్లోరినేషన్ చేయడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

**వివరాల నమోదులో నిర్లక్ష్యం**

రక్షిత మంచినీటి ట్యాంకులు, బోరుబావులు, చేతి పంపులు తదితర తాగునీటి వనరుల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ ఎక్కడా కనిపించడంలేదు. నీటి వనరుల పరీక్ష నివేదిక ఆధారంగా నీరు తాగేందుకు పని కొస్తుందా..? లేదా అన్న విషయాన్ని నమోదు చేయాల్సి ఉంటుంది. నాణ్యతలో వ్యత్యాసం ఉంటే ఆ ప్రాంతంలో ప్రత్యామ్నాయ వనరులతో తాగునీటిని అందించాల్సి ఉంటుంది. ఒక్కో నీటి వనరు వద్ద మూడు చోట్ల పరీక్షలు చేయడమే కాకుండా గ్రామంలోని రక్షిత మంచినీటి పథకాన్ని నెలలో మూడు సార్లు శుభ్రం చేయించాలి. వీటన్నింటిని పాటించినప్పుడే ప్రజలకు శుద్ధ జలం అందే అవకాశముంది. గతంలోనూ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో పంచాయతీలకు నీటి నాణ్యత కిట్లను అందజేశారు. చాలా చోట్ల పరీక్షలు చేయకుండానే మూలన పడేశారు.

# సర్కారు బడులకు జీరో విద్యుత్తు బిల్లు

కరీంనగర్ : గత కొంతకాలంగా ప్రభుత్వ పాఠశాలల సమస్యల్లో విద్యుత్తు బిల్లులు ఒకటి. రాష్ట్ర ప్రభుత్వం ఏటా తీసుకొస్తున్న సంస్కరణలు, బోధన సౌకర్యాలతో విద్యుత్తు వాడకం పెరుగుతుంది. పాఠశాలల నిర్వహణ నిధులు సరిపోక బిల్లుల బకాయిలు పేరుకుపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని మెజారిటీ పాఠశాలలు వేల రూపాయల బిల్లులు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సీఎం ప్రకటనతో ఉమ్మడి జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**రూ. వేలల్లో బకాయిలు** మన ఊరు-మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల కార్యక్రమాల ద్వారా ఉమ్మడి జిల్లాలోని సర్కారు బడుల్లో ఫ్యాన్లు, లైట్లు, బోర్‌పంపులు, శుద్ధజల ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఇంతకుముందే డిజిటల్ విద్యలో భాగంగా ప్రొజెక్టర్లు, కంప్యూటర్లు పాఠశాలల్లో ఉన్నాయి. మరో వైపు అధికారులు పాఠశాలలకు కేటగిరీ-7ఏ కింద విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చారు. పాఠశాలల్లో సెలవుల్లో మినహా కరెంటు వాడకం తప్పనిసరి కావడంతో బిల్లులు పెరుగుతున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నెలకు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు.. ఉన్నత పాఠశాలల్లో గదులు, డిజిటల్ తెరలు, విద్యార్థులు ఎక్కువ ఉండటంతో రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు.. కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలకు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు విద్యుత్తు బిల్లులు వస్తున్నాయి. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్ల నిర్వహణ నిధులు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. కొందరైతే సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నారు.



**నిర్వహణకు సరిపోని నిధులు..**

సర్కారు పాఠశాలలకు ప్రభుత్వం ఏటా విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.10 వేల నుంచి రూ.75 వేల వరకు నిర్వహణ నిధులు అందిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రూ.50 వేల నిధులిచ్చే పాఠశాలలు తక్కువగా ఉండగా.. రూ.10 వేలు, రూ.25 వేలు వచ్చేవి అధికంగా ఉన్నాయి. ఈ నిధులు జాతీయ పండుగలు, కంప్యూటర్లు, ల్యాబ్‌ల నిర్వహణ, స్టేషనరీ, విద్యుతు బిల్లులు, చిన్నచిన్న మరమ్మతులు, నెట్ ఛార్జీలు, తాగునీరు తదితర సదుపాయాలకు సరిపోవడంలేదని ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు. విద్యుత్తు బిల్లులు చెల్లిస్తే మిగిలిన వాటికి ఒక్క పైసా కూడా మిగలడం లేదని వాపోతున్నారు. దీంతో పెద్దమొత్తం విద్యుత్తు బిల్లులు బకాయిలుగా పేరుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో పాఠశాలల నిర్వహణకు నిధుల కొరత తప్పనుంది.

**సంతోషకర విషయం**సర్కారు బడులకు ఉచిత విద్యుత్తు అందిస్తామని సీఎం నిర్ణయం ఉపాధ్యాయుల్లో సంతోషాన్ని నింపింది. ఎన్నో ఏళ్లుగా ప్రధానోపా ధ్యాయులు ఇదే విషయాన్ని ప్రభుత్వాల ముందుంచుతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో బిల్లుల సమస్య తీరడంతోపాటు పాఠశాలల నిధులను ఇతర అవసరాలకు వాడుకునే వీలుంది.- కొమ్మెర శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం

# ఈ 'మాత్రం ఇవ్వలేరా?



హైదరాబాద్ : గ్రేటర్ వ్యాప్తంగా కార్మిక ఆరోగ్య బీమా(ఈఎస్ఐ) డిస్పెన్సరీల్లో ఔషధాల కొరతతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగైదు రకాల మాత్రలు రాస్తే...రెండింటిని ఇస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో బీపీ, మధుమేహం వ్యాధులకు సంబంధించి మందులు ఇవ్వడం లేదని రోగులు వాపోతున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, నొప్పి నివారణ, యాంటాసిడ్ లాంటి మందులూ అందుబాటులో లేకపోవడంతో రోగులు గగ్గోలు పెడుతున్నారు.గతంలో ఈ కేంద్రాలకు వచ్చే రోగులకు 269 రకాల వరకు ఔషధాలు సరఫరా చేసేవారు. ప్రస్తుతం అధిక రక్తపోటు, మధుమేహం, యాంటీబయోటిక్స్, క్యాన్సర్ తదితర మందులు సక్రమంగా ఇవ్వడం లేదు. మందుల కొరతతో తొలుత సుమారు 160 రకాలు అందించే వారు. ప్రస్తుతం అవీ లేవంటున్నారు.

దాదాపు అన్ని రకాల ప్రాథమిక ఆరోగ్య సమస్యలకు డిస్పెన్సరీల్లో చికిత్స అందిస్తుంటారు. వీటికి సంబంధించిన నిధులను కేంద్రమే నేరుగా రాష్ట్రానికి అందిస్తోంది. సరఫరాదారులకు బిల్లులు సక్రమంగా రాకపోవడంతో మందుల సరఫరాలో జాప్యమవుతున్నట్లు తెలిసింది. గ్రేటర్‌లో కార్మికులు బీమా చెల్లించినా సరైన సేవలందడం లేదు. అత్యవసర సమయంలో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు.

కొన్ని దృష్టాంతాలు..

జీడిమెట్ల డిస్పెన్సరీలో రోజు 1000 వరకు ఓపీ ఉంటోంది. రెండు రకాల బీపీ, మధుమేహం సంబంధించి మూడు రకాల ఔషధాలు లేవు. మందులు 3 ఇస్తే రెండు బయట కొంటున్నామని రోగులు వాపోయారు.

తుర్కయాంజిల్ పరిధిలోని కోహెడలోని ఈఎస్ఐ డిస్పెన్సరీలో ఓపీకి నిత్యం 100-150 మంది వస్తుంటారు. మూడు నెలలుగా అధిక రక్తపోటుకు సంబంధించి కొన్ని రకాల మాత్రలు ఇవ్వడం లేదు. రక్తహీనత తగ్గించే మందులు, టానిక్‌ల సరఫరా లేదని రోగులు తెలిపారు.

పటాన్‌చెరులో ఐదుగురికి ఇద్దరు, ఇస్నాపూర్‌లో ఐదుగురికి ఇద్దరు, ఘన్‌పూర్‌లో ఐదుగురికి ఒక్కరే వైద్యులు ఉన్నారు. మందులు వాయిదా పద్ధతిలో ఇస్తున్నారని రోగులు తెలిపారు.

పటాన్‌చెరు డిస్పెన్సరీకి పక్కా భవనం లేదు. రక్త పరీక్షలు చేసేందుకు పరికరాలు లేవు. వారం రోజులకు సరిపడా మందులను వాయిదాలుగా ఇస్తున్నారు.

తార్నాక డిస్పెన్సరీలో 70 శాతం మందులు లేవు. గర్భిణులకు నెలకు కావాల్సిన ఐరన్, కాల్షియం మందులను వారానికి ఇస్తున్నారు. బి-కాంప్లెక్, చిన్న పిల్లలకు దగ్గు మందులు లేవు.

గ్రేటర్‌లో ఈఎస్ఐ డిస్పెన్సరీలు 37

ఆధారపడిన కార్మికులు, కుటుంబ సభ్యులు 1314 లక్షల మంది

రెండు నెలలుగా తిరుగుతున్నా..-స్వరూప, నాగోలు

ఎప్పుడు వచ్చినా మందులు లేవని అంటున్నారు. వారం తర్వాత వచ్చిన ఇదే పరిస్థితి కొన్ని నెలలుగా థైరాయిడ్ మందులు ఉండటం లేదు. కొన్నిసార్లు బయట కొనుగోలు చేస్తున్నా.

మందులు బయట కొంటున్నా-భారతమ్మ, కుత్బుల్లాపూర్

మూడు నెలలుగా బీపీ మందులు లేవని అంటున్నారు. 15 రోజులకోసారి రూ.120 వెచ్చించి బయట కొంటున్నా. నెల రోజులకు మందులు రాస్తే...10-15 రోజులకే ఇస్తున్నారు. అన్ని రకాల మందులు ఇవ్వాలి.

# అడవి వనరులకు జలకళ



తాండూరు: జిల్లాలో ఎగువన కురిసిన వర్షాలు వరదగా మారి అడవుల్లోని చెక్‌డ్యాంలు, పర్కులేషన్ ట్యాంకుల్లోకి చేరుతోంది. వీటిలో కొన్ని పూర్తి జలకళను సంతరించుకుంటే మరికొన్ని మోస్తారు నీటితో ఉన్నాయి. దీంతో వన్యప్రాణులకు ఎద్దడి కష్టాలు తీరనున్నాయి. దీనికి తోడు కురిసిన వర్షాలకు అడవులు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. వాటికి అవసరమైన మేత లభించడంతో అక్కడే తిష్ఠ వేస్తున్నాయి.గడిచిన వేసవిలో పరిస్థితులు భిన్నంగా ఉండేవి. ఎద్దడి తలెత్తడంతో కొన్ని వన్య ప్రాణులు గ్రామాల సమీపంలోని తాగునీటి వనరులకు వచ్చే క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాయి. కొన్ని వేటగాళ్ల ఉచ్చులో పడి ప్రాణాలు కోల్పోయాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు అడవుల మధ్యలో ప్రవహించే కాలువలు, వాగులను ఆధారం చేసుకుని చెక్‌డ్యాంలు, కుంటలు నిర్మించారు. కురిసిన వర్షాలతో వనరుల్లోకి నీరు వచ్చి చేరాయి.

జీవం పోసుకున్న మొక్కలు

అడవుల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో అధికారులు గతేడాది 1.5 లక్షల వివిధ రకాల మొక్కలు నాటారు. వీటికి సమీపంలోనే కాంటూరు కందకాలు తవ్వించారు. తాజాగా కురిసిన వర్షాలకు నీరు గుంతల్లో చేరింది. సమీపంలోనే ఉన్న మొక్కలకు ఈ నీరే జీవం పోసింది. ప్రస్తుతం మొక్కలన్నీ ఏపుగా పెరుగుతున్నాయి.

నిండిన సాసర్‌ఫీట్లు

వేసవిలో ఎద్దడి తలెత్తడంతో అధికారులు ప్రత్యేకంగా సాసర్‌పిట్లను నిర్మించారు. ఒక్కో దానికి రూ.4 వేల వ్యయం చేశారు. ఫిబ్రవరి నుంచే ట్యాంకర్లలో నీళ్లు నింపారు. దీంతో సమీపంలో తచ్చాడుతున్న ప్రాణులు దాహం తీర్చుకున్నాయి. తాజాగా కురిసిన వర్షాలకు అవి కూడా పూర్తిగా నిండాయి.

దట్టంగా అడవులు

జిల్లా వ్యాప్తంగా యాలాల మండలం రాస్నం, నాగులపల్లి, తట్టేపల్లి, అడ్కిచర్ల, జిన్‌గుర్తి, అనంతగిరి, దామగుండం, నీళ్లపల్లి, మైల్వార్, మహమ్మదాబాద్‌లో( కొంతభాగం) అడవులు దట్టంగా ఉన్నాయి. ఇక్కడ దుప్పులు, జింకలు, కొండగొర్రెలు, నీలుగాయి, నక్కలు, తోడేళ్లు, హైనాలు, కుందేళ్లు, పందులు తదితర జంతువులు వేల సంఖ్యలో జీవిస్తున్నాయి.

జిల్లాలో వివరాలు

అడవి విస్తీర్ణం:1.08 లక్షల ఎకరాలు

చెక్‌డ్యాంలు: 65

పర్కులేషన్ ట్యాంకులు: 180

సాసర్ పిట్లు: 250

సెక్షన్లు: 27

బీట్లు:74

కాంటూరు ట్రెంచర్లు: 20,000

# సర్కారు వైద్యం తో భరోసా

సంగారెడ్డి : పల్లెలు, పట్టణాల్లో ఎక్కడ చూసినా డెంగీ బాధితులే కనిపిస్తున్నారు. వైద్యానికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఈ నెలలో 25 రోజుల్లోనే 116 డెంగీ కేసులు నమోదయ్యాయి. సంఖ్యా పరంగా రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత జిల్లా రెండో స్థానంలో ఉంది. పరిస్థితి భయపెడుతున్నప్పటికీ.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత పరీక్షలు చేసి వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యారోగ్యశాఖ రోగులకు భరోసా కల్పిస్తోంది.

టీ హబ్‌కు నమూనాలు

డెంగీ నిర్ధారణ కోసం జిల్లాలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో రక్త నమూనాలు సేకరించి జిల్లా కేంద్రంలోని తెలంగాణ రోగ నిర్ధారణ కేంద్రం(టీ హబ్)కు పంపిస్తున్నారు. అక్కడ ఎలీసా కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించి ఫలితాలను వెంటనే సంబంధిత రోగుల చరవాణులకు సందేశం రూపంలో పంపిస్తున్నారు. వాటి ఆధారంగా రోగులు పీహెచ్‌సీలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందవచ్చు. ప్రైవేటుకు వెళ్లి డబ్బులు నష్టపోవద్దని వైద్యారోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.

అత్యధికం అందోలులో..

గతేడాది సంగారెడ్డి, సదాశివపేట, రామచంద్రాపురం, పటాన్‌చెరు పట్టణాల్లో అత్యధికంగా డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈసారి అందోలు నియోజకవర్గంలోని పల్లెలు, పట్టణాలు డెంగీతో వణుకుతున్నాయని వైద్యారోగ్యశాఖ అధికారుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జులైలో 31 కేసులు కేవలం జోగిపేట ఆసుపత్రి పరిధిలోనే నమోదయ్యాయి. ఆగస్టులోనూ ఇదే పరిస్థితి.

అప్రమత్తంగా ఉన్నాం..

డెంగీ కేసుల్లో రాష్ట్రంలో జిల్లా ద్వితీయ స్థానంలో ఉండటంతో



వైద్యారోగ్య శాఖ అప్రమత్తమయింది. ఎక్కడైనా డెంగీ కేసులు నమోదయితే వెంటనే అక్కడ అందరికీ పరీక్షలు చేపట్టి మందులు అందజేస్తున్నాం. డెంగీ వల్ల భయపడాల్సిన అవసరం లేదు. అలాగని నిర్లక్ష్యం చేయవద్దు. మందులు, కిట్ల కొరతలేదు. సంగారెడ్డిలోని టీ-హబ్ ద్వారా 24 గంటల్లో డెంగీ పరీక్షలు చేసి ఫలితాలు అందజేస్తున్నాం. ప్రతి ఒక్కరు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పాత టైర్లు, కొబ్బరి బొండాలను పడేయాలి. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవాలి. -గాయత్రీదేవి, జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారిణి.

ప్రైవేటులో అధిక వసూళ్లు ప్రైవేటు దవాఖానాల్లో డెంగీ నిర్ధారణ కోసం రూ.800 నుంచి రూ.1000 వరకు రుసుము వసూలు చేస్తున్నారు. కొన్ని ఆసుపత్రులు రోగుల ప్లేట్‌లెట్లు పడిపోయాయని అధిక మొత్తం వసూలు చేస్తున్నాయనే విమర్శలూ ఉన్నాయి. అందుకే ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

# గుత్తేదారు నిర్లక్ష్యం... ముందుకు సాగని పనులు

ఆలేరు : మండు వేసవిలో సైతం నిండి ఆయకట్టు కింద రెండు పంటలకు (ఖరీఫ్, రబీ) సుమారు 10 వేల ఎకరాలకు సాగునీరందిస్తూ, దిగువన మూడు చెరువులను నింపుతూ.. మత్స్యకారుల కుటుంబాలకు ఉపాధి కల్పించే శాలిగౌరారం ప్రాజెక్టు శిథిలావస్థలో ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులకు గాను ప్రస్తుతం 16 అడుగులకు చేరింది. ఈ సీజన్‌కు వారం రోజుల కింద ఆయకట్టుకు సాగునీరు విడుదల చేశారు. ఈ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసేందుకు గత ప్రభుత్వం రూ.5.10 కోట్లను మంజూరు చేసి పనులు ప్రారంభించింది. సంబంధిత గుత్తేదారు చెరువు కట్ట మీద మట్టిపోసి చేతులు దులుపుకొన్నారు. ఆ మట్టి కూడా నాసిరకంగా పోయడంతో ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయి కోతకు గురైంది. పనులు పూర్తిచేయడానికి ఇచ్చిన గడువు ఏడాది క్రితమే పూర్తయింది. అయినా ఇప్పటికీ 70 శాతం పనులు చేయాల్సి ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

సత్యనారాయణ, డీఈ, ఐబీ

ప్రాజెక్టు మరమ్మతులకు రూ.5కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పినా గుత్తేదారు నిర్లక్ష్యం వీడటంలేదు. కాల్వ పనులు కూడా సక్రమంగా చేయలేదు. ఈ



విషయంపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సంబంధిత గుత్తేదారుకు నోటీసులు జారీ చేశాం. ప్రాజెక్టును పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం.

చేయాల్సిన మరమ్మతులు..

ప్రాజెక్టు కట్టపై కంపచెట్లు తొలగించి, మట్టిపోసి కట్టను పటిష్టం చేయాలి పల్లివాడ నుంచి శాలిగౌరారం ప్రాజెక్టు వరకు గల రాచకాల్వకు మరమ్మతులు చేసి, శుభ్రం చేయాలి

రాచకాల్వపై మూడు ఎస్ఎల్ఆర్ బ్రిడ్జిలు నిర్మించి, కాల్వకు ఇరువైపులా బలహీనంగా ఉన్న కట్ట వద్ద సీసీతో రక్షణ గోడలు నిర్మించాలి.

ప్రాజెక్టు కుడి కాల్వ ఆరు కిలోమీటర్ల మేర శుభ్రం చేసి చివరి భూములకు సాగునీరందించాలి.

చేసినవికట్టపై ఉన్న కంపచెట్లను పూర్తిస్థాయిలో తొలగించలేదు. నామమాత్రంగా మట్టిపోయడంతో వర్షానికి కొట్టుకుపోయి కోతకు గురైంది.రాచకాల్వ 13 కి.మీ మేరకు మాత్రమే శుభ్రం చేశారు. కాల్వ నిండా కంపచెట్లతో అధ్వానంగా తయారైనా పూర్తిస్థాయిలో పనులు చేయకుండా వదిలేశారు.ప్రాజెక్టు కట్టపై చెట్లు తొలగించి, తూతూ మంత్రంగా పోసిన మట్టికే గుత్తేదారు రూ.2కోట్ల వరకు బిల్లు తీసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.

# రైతు వేదికల్లోకి ఎరువులొచ్చేనా..?

ఆలేరు : పంటల సాగులో ఆధునిక పద్ధతులను జోడిస్తూ విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. భిన్నమైన పంటల సాగు, భూసార పరీక్షలు, ఎరువుల వినియోగంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన లేని పరిస్థితి. కర్షకులకు అధికారులు అందుబాటులో ఉండి మెలకువలు అందించాలనే ఉద్దేశంతో గత భారాస ప్రభుత్వం నల్గొండ ఉమ్మడి జిల్లాలో రూ.78.05 కోట్లు వెచ్చించి 314 రైతు వేదికలు నిర్మించింది. వీటిని ఎరువుల విక్రయ కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించింది. అంతలోనే ఎన్నికలు రావడంతో అమల్లోకి రాకుండా పోయింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వేదికల్లోనే వ్యవసాయ శాఖాపరంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వీటితోపాటు మరిన్ని సేవలనూ అందుబాటులోకి తీసుకురావాలని అన్నదాతలు ఆశిస్తున్నారు.

గత నిర్ణయాలు ఇలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంటల సాగుకు అవసరమైన ఎరువులను సగం మేర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్), ఆగ్రోస్ కేంద్రాలు, డీసీఎంఎస్, హాకా సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే నిర్ణీత ధరలకు సరఫరా చేస్తోంది. మిగతా యాభైశాతం ఎరువుల విక్రయాలు ప్రైవేటు దుకాణాల ద్వారా సాగుతున్నాయి. రైతు వేదికల్లో వసతులు ఉండటంతో ఎరువులనూ విక్రయించాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏ క్లస్టర్ పరిధిలోని రైతులు అదే క్లస్టర్ రైతు వేదికల ద్వారా ఎరువులు తీసుకునేందుకు అనువుగా ఉంటుందని



భావించారు. ఇది విజయవంతమైతే విత్తనాలు కూడా విక్రయించడానికి సంసిద్ధంగా ఉన్నట్లు నాడు పాలకులు ప్రకటించారు. ఎరువుల నిల్వలు, భద్రత, రవాణా తదితర అంశాలను డీసీఎంఎస్‌లకు అప్పగించాలనుకున్నారు. ప్రభుత్వం మారిన క్రమంలో నాటి నిర్ణయాలు కార్యరూపం దాల్చలేదు. ఎరువులు, విత్తనాల విక్రయాలు, భూసార పరీక్షల జాడ లేకుండా పోయింది. కొన్ని చోట్ల రైతు వేదికలు తెరచుకోవడం లేదు. వేదికల నిర్వహణకు అందాల్సిన నిధులు సకాలంలో మంజూరు కాకపోతుండటంతో ఇవి అధికారులకు భారంగా మారింది.

ఉమ్మడి జిల్లాలో

సాగు విస్తీర్ణం.. ఎరువుల అవసరం..

| జిల్లా | రైతులు | రైతు వేదికలు | సాగు విస్తీర్ణం (ఎకరాల్లో) | ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో) |
|---|---|---|---|---|
| నల్గొండ | 4,21,278 | 140 | 9,82,192 | 1,64,301 |
| సూర్యాపేట | 3,30,326 | 82 | 7,26,482 | 1,34,112 |
| యాదాద్రి | 1,57,206 | 92 | 6,65,000 | 80,954 |

# డెంగీ పడగ.. డిఫ్తీరియా ముప్పు!

హైదరాబాద్ : వానలు కురుస్తుండటంతో గ్రేటర్ వ్యాప్తంగా ప్రమాదకరమైన డెంగీ, డిఫ్తీరియా కేసులు పెరుగుతున్నాయి. బాధితుల్లో ఎక్కువ శాతం చిన్నారులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. నిలోఫర్‌లో గత రెండు రోజుల్లో ఏడుగురు చిన్నారులు డెంగీకి చికిత్స తీసుకుంటున్నారు. గాంధీలో నలుగురు చిన్నారులు అదే వ్యాధితో చేరారు. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి వస్తున్న డెంగీ, డిఫ్తీరియా కేసుల్లో చిన్నారులు సైతం ఉంటున్నారు.

టీకాలకు దూరంగా ఉండటంతో.. గ్రేటర్‌లో దాదాపు 30 శాతం మంది చిన్నారులు ఇప్పటికీ డిఫ్తీరియా టీకాలకు దూరంగా ఉండటం.. డోసులు కొనసాగించక పోవడంతో దాని బారిన పడుతున్నారు. చిన్నారుల్లో ఒకరికి సోకితే...ఇంకొకరికి సులువుగా అంటుకుంటుంది. చికిత్సల్లో నిర్లక్ష్యం చేస్తే కొన్నిసార్లు ప్రాణాలకు ముప్పుంటుందని వైద్య



నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది టాన్సిల్స్, గొంతు, ముక్కు, చర్మాన్ని ప్రభావితం చేస్తుంది. చలి, జ్వరం, బిగ్గరగా దగ్గు, గొంతులో మంట, నాలుక పూత, శ్వాస తీసుకోవడం, మింగడంలో ఇబ్బంది, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలుంటాయి.

**ఈ జాగ్రత్తలు ముఖ్యం..**

జ్వరాల విషయంలో అశ్రద్ధ వద్దు. ఆఖరి నిమిషంలో వైద్యులను సంప్రదిస్తే కొన్నిసార్లు పరిస్థితి విషమంగా మారుతుంది.

పాఠశాలల వద్ద పారిశుద్ధ్యం మెరుగుకు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలకు కాళ్లు, చేతులు కప్పిఉంచేలా దుస్తులువేసి పంపాలి. మాస్క్‌తోపాటు శానిటైజర్ తప్పకుండా పిల్లల వద్ద ఉంచాలి.

పిల్లలు లేదా పెద్దలకు జ్వరం వస్తే పారాసిటమాల్ తప్ప..వైద్యుల సూచనల లేకుండా ఇతర మందులు వేయకూడదు. 24-48 గంటల్లో తగ్గనప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలి.

బాగా కాచి చల్లార్చిన నీళ్లతోపాటు వేడి ఆహారం ఇవ్వాలి. పిల్లలను బయట ఆహారానికి దూరంగా ఉంచాలి.

101 డిగ్రీల కంటే జ్వరం, తీవ్ర తలనొప్పి, కళ్లవెనుక నొప్పి, చలిజ్వరం, వాంతులు, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, రక్తంలో ఆక్సిజన్ తగ్గడం, బీపీ తగ్గిపోవడం, శరీర భాగాల నుంచి రక్తస్రావం కావడం వంటి లక్షణాలుంటే వెంటనే ఆసుపత్రికి తరలించాలి.

# 2.80 లక్షల రైతులకు రుణమాఫీ!

కరీంనగర్ : ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు తీపి కబురు చెప్పింది. రూ.2 లక్షల వరకు పంట కోసం తీసుకున్న రుణాన్ని మాఫీ చేసేందుకు ఉత్తర్వులను వెలువరించింది.. ఆ మార్గదర్శకాల ప్రకారం నాలుగు జిల్లాల అధికారులు అర్హుల లెక్క తీయనున్నారు. వ్యవసాయశాఖ అధికారులతోపాటు లీడ్ బ్యాంక్ మేనేజర్లు జిల్లాల వారీగా ఎంతమంది ఈ రుణమాఫీ పథకం పరిధిలోకి వస్తారనే విషయమై దృష్టి సారిస్తున్నారు. భూమి ఉన్న ప్రతి రైతు బ్యాంకులో తీసుకున్న అప్పు, వడ్డీ కలిపి రూ.2 లక్షల వరకు ఉంటే మాఫీ చేస్తారు. అంతకుమించి ఉన్న మొత్తాన్ని అన్నదాత చెల్లించుకుంటే మిగతాది రుణమాఫీ పరిధిలోకి వస్తుంది.

సుమారు రూ.4 వేల కోట్ల వరకు అవసరం

నాలుగు జిల్లాల పరిధిలో దాదాపుగా 2.80 లక్షల మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా తేలే అవకాశముందని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ మధ్యకాలంలో తీసుకున్న రుణానికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. ఈసారి పక్కాగా రేషన్‌కార్డును ప్రామాణికంగా పెట్టడంతో ఇవి ఉన్న రైతులే లబ్ధిదారులుగా మారనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మాఫీ కోసం సుమారుగా రూ.4 వేల కోట్ల వరకు నిధులు అవసరముంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎక్కువగా చిన్న కమతాల్లో పంటలు వేసిన వారే గతంలో పంటసాగు కోసం స్వల్పకాలిక రుణాలు తీసుకున్నారు. పైగా గత సర్కారు గతేడాది రూ.లక్ష లోపు వారికి రుణమాఫీ చేసింది. దీంతో అంతకన్నా ఎక్కువ ఉన్న వారి బకాయిలు అలాగే ఉండిపోయాయి. ఆ మొత్తం ప్రతి నెలా వడ్డీతో కలిపి పెరిగిపోయింది. వ్యవసాయశాఖ అధికారులకు



వచ్చిన నమూనా ప్రకారం గ్రామాల వారీగా అర్హుల వివరాలను సేకరించనున్నారు. ప్రతి బ్యాంకు పరిధిలో సలహాలు, సంప్రదింపుల కోసం ఓ నోడల్ అధికారిని నియమించ నున్నారు.

**గతంలో ఇలా..**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరవాత అప్పటి తెరాస ప్రభుత్వం 2014లో రుణమాఫీ చేసింది. అప్పుడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4,48,634 మంది రైతులకు రూ.2,221 కోట్లను పంట రుణాలుగా ఇచ్చినట్లు బ్యాంకర్లు మొదట లెక్క తేల్చారు. 28,083 మంది రైతులు బంగారం తాకట్టు పెట్టి రూ.284 కోట్లు రుణం తీసుకున్నట్లు గుర్తించారు. 2014 మార్చి 31 వరకు 4,76,717 మందికి రూ.2,505 కోట్లు అవసరమని ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో అప్పుడున్న నిర్ణీత వ్యవధి ప్రకారంగా పరిశీలన జరిపి 3,84,106 మందిని రుణమాఫీకి అర్హులని తేల్చారు. ఇందుకోసం రూ.1683 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. మొదట రూ.25 వేలు, తరువాత రూ.50వేల రుణాల వారికి ప్రయోజనం కలిగింది. తరువాత రూ.లక్ష వరకు ఉన్నవారికి మాఫీ చేశారు. రూ.లక్షకుపైగా రుణం ఉన్నవారు అధికంగానే ఉన్నారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో రూ.రెండు లక్షల లోపు రుణం తీసుకున్న ప్రతి ఒక్కరికి మాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల తరువాత అందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టింది.

# ఉచిత జలం.. సిబ్బంది మాయాజాలం



హైదరాబాద్ : అంటగడుతున్న వైనం ఎస్ఆర్‌నగర్‌లో ఉండే శ్రీనివాస్‌కు చెందిన అపార్ట్‌మెంట్‌లో ఇటీవల నీటి మీటరు పాడైంది. జలమండలి సిబ్బందికి ఫిర్యాదు చేశాడు. వెంటనే కొత్త మీటరు పెట్టుకోవాలని, లేదంటే ఉచిత నీటి పథకం వర్తించదని చెబుతూ.. తామే మీటర్ సరఫరా చేస్తామని సూచించారు. సిబ్బంది చెప్పిన ధర బహిరంగ మార్కెట్ ధర కంటే మూడు రెట్లు ఉండడంతో నిరాకరించారు. గ్రేటర్ వ్యాప్తంగా చాలామంది వినియోగదారులు ఇలాంటి పరిస్థితే ఎదుర్కొంటున్నారు.

**గ్రేటర్‌లో ఉచిత నీటి పథకం వర్తించాలంటే..** ప్రతి నల్లాదారుడు తన ఆధార్ నంబర్‌ను కస్టమర్ అకౌంట్ నంబర్‌కు అనుసంధానం చేయాలి. తప్పనిసరిగా నల్లాకు పెట్టిన మీటర్ పనిచేస్తుండాలి. ఇక్కడే జలమండలి సిబ్బంది పంట పండుతోంది. ఇప్పటికే చాలా మీటర్లు రిపేర్లు కావడం, పాడైపోవడంతో కొత్తవి అవసరమవుతున్నాయి. ఇందుకు గతంలో జలమండలి దాదాపు 15 కంపెనీలను ఎం-ప్యానల్ చేసింది. మీటర్లు పాడైనా, కొత్తవి పెట్టుకోవాలన్నా.. ఈ కంపెనీల నుంచే కొనుగోలు చేయాలని సూచించింది. చాలామంది వినియోగదారులకు ఈ మీటర్లు ఎక్కడ దొరకుతాయో తెలియదు. దీన్ని కొందరు సిబ్బంది అనుకూలంగా మార్చుకుంటున్నారు. అర అంగుళం నల్లా కనెక్షన్‌కు రూ.3వేల వరకు మీటర్ ధర ఉండగా.. సిబ్బంది ఆరేడు వేలు వసూలు చేస్తున్నారు. బహుళ అంతస్తుల భవనాలకు అమర్చే ఏఎంఆర్ మీటర్లకు రూ.20-30 వేల వరకు ఉంటే.. రూ.50 వేలపైనే డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నల్లాదారులు బహిరంగ మార్కెట్‌లో మీటర్లు కొని అమర్చుకుంటున్నా.. రీడింగ్ తీయడానికి వచ్చే సిబ్బంది కొర్రీలు పెడుతున్నారు. ఉచిత పథకం నుంచి మినహాయిస్తామని చెబుతుండటంతో నల్లాదారులు బెంబేలెత్తుతున్నారు.

**12వేల ఏఎంఆర్ మీటర్లు మూలకు..**

గతంలో జలమండలి కోట్లు పెట్టి ఆటోమేటిక్ నీటి మీటర్లు కొనుగోలు చేసింది. వీటిలో 12వేల మీటర్లు పాడైపోయినట్లు జలమండలి లెక్కలు వేసింది. అప్పట్లో కమీషన్లకు కక్కుర్తి పడి నాసిరకం మీటర్లను కొనుగోలు చేశారనే ఆరోపణలున్నాయి. ఒక్కో మీటర్‌ను రూ.30 వేల నుంచి లక్షలోనే కొనుగోలు చేసి సరఫరా చేసింది. తర్వాత ఈ డబ్బులను నల్లాదారుల నుంచి వసూలు చేసింది. ప్రస్తుతం చాలా మీటర్లు పాడైపోవడంతో జలమండలి సిబ్బంది దృష్టికి తీసుకొస్తున్నారు. ఇదే అదనుగా భారీ ఎత్తున వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు. ఉచిత నీటి పథకం నిలిచిపోనుండటంతో వేరే దారి లేక సిబ్బంది అడిగినంత ముట్టజెబుతున్నారు.

# కాలుష్య కార్ఖానా.. కాసుల ఖజానా



హైదరాబాద్: అక్రమ సంపాదన కోసం జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్‌లోని ఓ ఉన్నతాధికారి కాలుష్యాన్ని వెదజల్లే కారా?నాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. మామూళ్లు తీసుకుని జనావాసాల మధ్య కొత్త పరిశ్రమలకు అనుమతిస్తూ, దాడుల పేరుతో పాత కంపెనీల నుంచి నెలవారీగా వసూళ్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో 1,800 పరిశ్రమలు ఉండగా.. వాటిలో 1,450 అనుమతి లేని కాలుష్యకారక కేంద్రాలని, బల్దియా నిఘా కొరవడటంతో సమస్యను అదుపు చేయలేకపోతున్నామని టాస్క్‌ఫోర్స్ పోలీసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ కారా?నాల కాలుష్యంతో స్థానికంగా ఉండలేకపోతున్నామని ఆయా ప్రాంతాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమకో ధర నిర్ణయించి, అడిగినంత ఇవ్వకపోతే కూల్చివేతలకు పాల్పడుతున్నారంటూ బాధితులు తాజాగా జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేయడం గమనార్హం.

**తనిఖీల పేరుతో...** నిషేధిత వస్తువుల తయారీ పరిశ్రమలకు కాటేదాన్, గగన్‌పహాడ్, జల్‌పల్లి, శ్రీరామ్‌కాలనీ, హసన్‌నగర్, టాటానగర్, అత్తాపూర్, రాంబాగ్ ప్రాంతాలు అడ్డాలుగా మారాయి. ప్లాస్టిక్ కవర్లు, సీసాలు, గ్లాసులు, ఇతరత్రా వస్తువులకు సంబంధించిన కర్మాగారం పెట్టేందుకు వ్యాపారులు ఆ ప్రాంతాలనే ఎంచుకొంటున్నారు. బల్దియాలోని కొందరు అవినీతి అధికారులు ఇస్తున్న ప్రోత్సాహమే అందుకు కారణం. ఇద్దరు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది.. నిర్మాణంలో ఉన్న పరిశ్రమల వద్ద రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల వరకు వసూలు చేస్తున్నారని, ఇవ్వకపోతే ఉపకమిషనర్ కూల్చివేస్తారని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఓ బాధితుడు తాజాగా కేంద్ర కార్యాలయాన్ని ఆశ్రయించారు. నేషనల్ లాడ్జి, ఓ బిస్కట్ కంపెనీ గోదాములను అడ్డాగా చేసుకుని డబ్బులు వసూలు చేస్తుంటారని వాపోయారు.

అక్రమ వసూళ్ల కోసం రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు పలుచని ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ఇతర హానికర వస్తువుల తయారీ కేంద్రాలను ప్రోత్సహిస్తున్నారనే విమర్శలున్నాయి.

**ఇతర సర్కిళ్లలోనూ..** జీహెచ్ఎంసీ పరిధిలో ఆరు జోన్లు, వాటి కింద 30 సర్కిళ్లు .. ఒక్కో సర్కిల్‌లో 4-6 డివిజన్లు ఉన్నాయి. కారా?నాల విషయంలో.. కాలుష్య నియంత్రణ మండలి, జీహెచ్ఎంసీ అధికారుల ప్రమేయం ఉంటుంది. అదే అదనుగా.. కొందరు సర్కిల్ అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలను సొమ్ము చేసుకుంటున్నారు. కనిపించిన ప్రతి నిర్మాణాన్ని ఫొటో తీసుకోవడం, ఆఫీసుకు వెళ్లాక టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో నిర్మాణదారులను పిలిపించుకుని లంచం డిమాండ్ చేస్తున్నట్లు బాధితులు గగ్గోలు పెడుతున్నారు. రాజేంద్రనగర్, అల్వాల్, పటాన్‌చెరు సర్కిళ్ల ఉన్నతాధికారులపై ఈ తరహా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

# అడుగంటిన భూగర్భ జలాలు.. ఆందోళనలో అన్నదాత



కోనరావుపేట: ఈ ఏడాది వర్షాలు సాధారణం కంటే ఎక్కువ కురుస్తాయని వాతావరణ శాఖ చల్లని కబురు అందించడంతో రైతన్నలు ఉత్సాహంతో ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయనే సంకేతాలతో రైతులు జూన్ మొదటి వారంలోనే వరినారు పోశారు. పచ్చిరొట్ట ఎరువులు సైతం వేశారు. నెలన్నర కావస్తున్నా ఆశాజనకంగా వర్షాలు కురవడం లేదు. దీంతో వ్యవసాయ, బోరు బావుల్లో భూగర్భ జలాలు పడిపోవటంతో పచ్చిరొట్ట ఎరువు దమ్ము చేయటం ప్రశ్నార్థకంగా మారింది. నాటు వేయటానికి అదను దాటిపోవటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు.

**1.80 లక్షల ఎకరాల్లో అంచనా..**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ ఏడాది 1.80 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. జూన్‌లో వరినారు మడులను సిద్ధం చేశారు. నెలరోజుల వ్యవధిలో నాటు వేయాల్సిన రైతులు వర్షాలు కురవక వేయటం లేదు. జూన్‌లో 11.59 మీటర్లకు భూగర్భ జలాలు పడిపోయాయి. జులైలో కూడా వర్షాలు పడకపోతే 13 మీటర్ల మేర పడిపోయే ప్రమాదం నెలకొంది. గత ఏడాది జూన్‌తో పోలిస్తే ఈ సంవత్సరం 1.82 మీటర్ల మేర కిందకు భూగర్భ జలాలు పడిపోయాయి.


**దమ్ము చేయడం ప్రశ్నార్థకంగా మారింది**

జూన్ మొదటి వారంలో నాలుగు ఎకరాలలో వరిసాగు చేయటానికి నారు పోశాను. వ్యవసాయ బావిలో నీరు అడుగంటడంతో నారు మడిని కాపాడుకోవటం కష్టంగా మారింది. వర్షాలు లేక పచ్చిరొట్ట ఎరువు దమ్ము చేయటం ప్రశ్నార్థకంగా మారింది. ముదిరిన నారుతో నాటు వేస్తే ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే అవకాశం లేదు.

పొన్నం చిన్న రాజేశం రైతు ధర్మారం

# సిగ్నల్ లేక.. సేవలందక..!

కొత్తగూడెం: 4జీ నుంచి 5జీకి దేశం పరుగులు పెడుతున్నా.. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్స్ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతున్నకొద్దీ ప్రజలకు సేవలన్నీ అంతర్జాలంలోనే అందుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు, రైతుభరోసా వంటి సంక్షేమ పథకాలు బ్యాంకు ఖాతా ద్వారా వర్తిస్తుండటంతో వాటిని పొందాలంటే కొన్ని కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది. ఈసమస్యను పరిష్కరించటానికి అవసరమున్నచోట వినియోగదారుల సేవా కేంద్రాలు ఏర్పాటుచేయాలని బ్యాంకులు నిర్ణయించుకున్నా.. సిగ్నల్స్ సమస్య ఎదురవుతుండటంతో సేవలు అందించలేకపోతున్నాయి. బ్యాంకు సేవలకు దూరంగా ఉన్న 19 మారుమూల ప్రాంతాలను అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లోని వృద్ధులు, దివ్యాంగులు సైతం పింఛన్ల కోసం ప్రతినెలా మండల కేంద్రాలకు వెళ్లాలి. చర్ల మండలం పూసుగుప్ప, ఆళ్లపల్లి మండలం అడవిరామవరం గ్రామస్థులైతే బ్యాంకు సేవల కోసం పది కి.మీ. దూరం ప్రయాణించాలి. ఈప్రాంతాల్లో సేవలందించటానికి వినియోగదారుల సేవా కేంద్రాల ఏర్పాటుకు బ్యాంకులు ముందుకొచ్చినా సిగ్నల్ సమస్య కారణంగా కార్యరూపం దాల్చటం లేదు. సెల్‌ఫోన్లు సైతం సరిగ్గా పనిచేయటం లేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి సిగ్నల్ సామర్థ్యాన్ని పెంచాలని కోరుతున్నారు.మాది కరకగూడెం మండలం రేగళ్ల. ఇక్కడ సిగ్నల్ సరిగ్గా లేకపోవటంతో అంతర్జాల సేవలందించటానికి ఎవరూ ముందుకు రావటం లేదు. ముఖ్యంగా బ్యాంకు సేవలు పొందాలంటే మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. సిగ్నల్ సామర్థ్యం మెరుగుపడితే బ్యాంకులు వినియోగదారుల



సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తామంటున్నాయి.

– కుంజ వసంతరావు, మాజీ సర్పంచి, రేగళ్ల

జిల్లాలో సిగ్నల్ అందని ప్రాంతాలను గుర్తించాం. ఆయాచోట్ల బ్యాంకు సేవలు అందించటానికి వినియోగదారుల సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలని బ్యాంకులకు సూచించాం. సిగ్నల్ సమస్య కారణంగా వాటి ఏర్పాటు సాధ్యం కావటం లేదు. సమస్య పరిష్కారం కాగానే ప్రజలకు బ్యాంకు సేవలను సులభతరం చేస్తాం.

– రాంరెడ్డి, లీడ్‌బ్యాంక్ మేనేజర్

**బ్యాంకులున్న చోట అదేతీరు**

కొన్నిచోట్ల టవర్లు ఏర్పాటుచేసినా వాటినుంచి కావాల్సినంత సిగ్నల్స్ అందటం లేదు. సిగ్నల్‌లో హెచ్చుతగ్గులుంటే బ్యాంకు సేవలందించటం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. గుండాల మండలం కాంచనపల్లి ఎస్‌బీఐ, ఆళ్లపల్లిలోని యూబీఐలో సిగ్నల్ సమస్య కారణంగా సేవల్లో జాప్యం జరుగుతోంది. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోంది.

# పారిశుద్ధ్యం.. పట్టని వైనం

సిరిసిల్ల : పట్టణాల్లో స్వచ్ఛత పాటించి ప్రజలకు ఆరోగ్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం లక్షలు ఖర్చు చేస్తోంది. వివిధ పద్ధతులతో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినా పుర అధికారుల నిర్లక్ష్యంతో ఫలితం కాస్తా మురుగు నీటిలో కలిసేలా తయారైంది. సిరిసిల్ల పట్టణంలోని శివారు కాలనీల్లో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారింది. కాల్వలు లేక మురుగు నీరంతా ఇళ్ల మధ్య నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి నిల్వలతో దోమల తీవ్రత పెరిగి ప్రజలు జ్వరాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక పారిశుద్ధ్య పనులు గాడి తప్పుతున్నాయి.

**చెరువులా ఖాళీ స్థలాలు...**

పట్టణంలో చాలా వార్డులలో మురుగు కాల్వలు లేక ఇళ్ల ముందే ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిండి చెరువులా మారుతున్నాయి. సిరిసిల్ల పట్టణ పరిధిలోని చంద్రపేట, జ్యోతినగర్, కొత్తబస్టాండ్, శాంతినగర్, శివనగర్, రాజీవ్‌నగర్, ముష్టిపల్లి తదితర కాలనీల్లో పరిస్థితి



అధ్వాన్నంగా తయారైంది. అక్కడ సీసీ రోడ్లు నిర్మించారు కానీ మురుగు కాల్వల నిర్మాణం చేపట్టక పోవడంతో కాలనీల్లో ఇంటికో మురుగు కాల్వ దర్శనమిస్తున్నాయి. దోమల తీవ్రతతో అక్కడి వారు జ్వరాల బారిన పడుతున్నారు. దోమల నివారణకు ఫాగింగ్, దోమల మందు పిచికారీ చేయకపోవడం అధికారుల పర్యవేక్షణకు అద్దం పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నిల్వకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం..**

శివారు కాలనీలు, విలీన గ్రామాలతో పాటు సిరిసిల్ల పట్టణంలో రెండు రోజుల్లో పారిశుద్ధ్య పనుల పూర్తికి చర్యలు తీసుకుంటాం. చేనేత, జౌళిశాఖ కార్యాలయం ముందు బ్లీచింగ్ పౌడర్ చల్లి మురుగు లేకుండా చూస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలతో దోమల మందు పిచికారీ చేయిస్తాం.సత్యనారాయణ, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్

# గట్లు తెంచి.. గరళం నింపి

హైదరాబాద్ : రాజధాని పరిధిలో చెరువుల తీరు మారడం లేదు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం చెరువుల ఆక్రమణ, కలుషితంపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నా ఫలితం కన్పించడం లేదు. కొన్ని చెరువుల్లో భారీ నిర్మాణాలు వెలిసినట్లు విచారణలో తేలింది. హైకోర్టు ఆదేశాల మేరకు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 13 చెరువులను అడ్వొకేట్ కమిషన్ ఇటీవల ప్రత్యక్ష పరిశీలన చేస్తే పరిస్థితి ఎంత దారుణంగా విధితమైంది. దీనిపై బల్దియా, హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారులు అక్రమ నిర్మాణాలకు పరోక్షంగా తోడ్పాటు ఇస్తున్నట్లు వెలుగులోకి వస్తోంది.

**ఇంత దారుణమా!**

హైదరాబాద్ జిల్లాలో 185 చెరువులుంటే హెచ్ఎండీఏ పరిధిలో 4500 వరకు చెరువులున్నాయి. నగరంలోని చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోకపోవడంపై 2007లో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారించిన ధర్మాసనం ఇటీవల తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో అధ్యయనం



చేసి నివేదిక సమర్పించాలని డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, టి.శ్రీకాంత్‌రెడ్డిలతో అడ్వొకేట్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిటీ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని 13 చెరువులను సందర్శించి ఇటీవల నివేదిక సమర్పించింది. ఆయా చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని, చెత్తాచెదారం, మురుగుతో నిండాయని కమిషన్ నిర్ధారించింది. చెరువుల్లోని మురుగునీటితో పండించిన ఆకుకూరలు, కూరగాయలు, చేపలు తింటే ప్రజల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం ఉంటుందని పేర్కొంది. చెరువులు, కాలుష్యం, ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు తదితర కేసుల సత్వర పరిష్కారానికి హైకోర్టు పరిధిలో గ్రీన్ బెంచ్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను సూచించింది. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ శాస్త్రీయంగా నిర్వహించి తుది నోటిఫికేషన్ జారీ చేయాలని కమిషన్ కోరింది. ఆక్రమణదారులపై చర్యలు తీసుకునేలా ఇరిగేషన్ శాఖకు తగిన అధికారాలు కల్పించాలని, ఉమ్మడిగా కృషి చేస్తేనే చెరువుల పరిరక్షణ సాధ్యమని వెల్లడించింది.

# ముందు ఫీడర్లు.. ఆ తర్వాత ట్రాన్స్‌ఫార్మర్లు

హైదరాబాద్: మాసబ్‌ట్యాంక్ సెక్షన్‌లో ఇటీవల ఓ ట్రాన్స్‌ఫార్మర్ పాడవడంతో ఆరేడు గంటలు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన లేక.. ఎక్కువ గంటలు శ్రమించారు. కార్యాలయంలో ఉండే పైఅధికారులకు క్షేత్రస్థాయిలో రియల్‌టైమ్‌లో అంతరాయాలు తెలిసే వ్యవస్థ లేకపోవడం ప్రధాన లోపంగా ఉంది.

ఉన్నతాధికారులకు సమాచారం లేదు.. సిటీలో సరఫరాకు సంబంధించి ఫీడర్లలో, ట్రాన్స్‌ఫార్మర్లలో గంటలపాటు అంతరాయం ఏర్పడినా ఉన్నతాధికారులకు సమాచారం ఉండటం లేదు. గతంలో ఫీడర్ల స్థాయిలో ఆటోమేషన్ చేసినా అవి ప్రధాన నగరంలో 1100 ఫీడర్ల వరకే పరిమితమయ్యాయి. సిటీలో దీనికి మూడు రెట్లు ఫీడర్లు ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల(డీటీఆర్) సంఖ్య లక్షల్లోనే ఉంది. వీటి సరఫరా నిల్చిపోతే పైఅధికారులకు తెలిసే వ్యవస్థ లేదు. ఇదే పర్యవేక్షణకు లోపంగా ఉంది. విస్తరించని సాంకేతికత.. 226 విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని 1100 ఫీడర్లలో ఆటోమేషన్ చేపట్టి స్కాడాతో అనుసంధానం ఎప్పుడో చేపట్టారు. ఆఫీస్ నుంచి ఉన్నతాధికారులు ఫీడర్ల బ్రేక్‌డౌన్లను తెలుసుకునే వ్యవస్థను తీర్చిదిద్దారు. మిగతా ఉపకేంద్రాలకు విస్తరించాలనే ప్రణాళికలు ఉన్నా.. గతంలో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు.

ట్రాన్స్‌ఫార్మర్ స్థాయిలో ఉంటేనే.. ఇతర నగరాల్లోని డిస్కంల్లో ఆటోమేషన్ ట్రాన్స్‌ఫార్మర్ స్థాయిలో ఉన్నట్లు ఇటీవల అధ్యయనానికి వెళ్లిన అధికారుల బృందాలు గుర్తించాయి. ఫీడర్లకు సెన్సర్లు ఏర్పాటు చేసి ఆటోమేషన్ చేశాక, ట్రాన్స్‌ఫార్మర్లపై దృష్టి సారించే అవకాశముందని సమాచారం.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీగా అమరావతి: సీఎం చంద్రబాబు



అమరావతి: 90 రోజుల్లో సీఆర్‌డీఏ కార్యాలయ నిర్మాణం పూర్తి కావాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాజధాని ప్రాంతంలో త్వరితగతిన జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సిటీగా అమరావతిని తీర్చిదిద్దాలన్నారు. ఏఐ, అమరావతిని కలిపి ఆంగ్లంలో లోగో రూపొందించాలని, అత్యాధునిక టెక్నాలజీలను ఉపయోగించి నాణ్యతలో ఎక్కడా రాజీ పడొద్దని సీఎం దిశా నిర్దేశం చేశారు.

హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు పైనా సీఎం సమీక్షించారు. హ్యాపీ నెస్ట్ ప్లాట్లన్నీ ఒక్క గంటలో అమ్ముడు పోయాయని గుర్తు చేసుకున్న సీఎం.. గత ప్రభుత్వ చర్యల కారణంగా వచ్చిన నష్టాన్ని పూడ్చేలా విధానాలు రూపొందించాలని ఆదేశించారు. రాజధాని ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ కోసం 190 ప్రొక్లెయిన్లు వినియోగిస్తున్నామని, 60 శాతం పూర్తయినట్టు అధికారులు వివరించారు. మెట్రో రైలు ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని సీఎం స్పష్టం చేశారు. విశాఖపట్నం, విజయవాడలో చేపట్టబోయే మెట్రో రైలు ప్రాజెక్టు పనులు త్వరితగతిన చేపట్టాలని సీఎం ఆదేశించారు.

**అమరావతిలో 3,550 ఎకరాలు సేకరించాల్సి ఉంది: మంత్రి నారాయణ...** ప్రస్తుతం ఖజానా అంతా ఖాళీ అయింది, అమరావతి రైతులకు సెప్టెంబరు 15లోగా వార్షిక కౌలు చెల్లిస్తామని ఏపీ మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని అమరావతిపై సీఎం సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుకు సీఎం క్లియరెన్స్ ఇచ్చారు. రూ.700 కోట్లతో గతంలో ప్రారంభించాం.. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పూర్తి కావాలంటే రూ.930 కోట్లు కావాలి. సీఆర్డీఏ కార్యాలయాన్ని త్వరగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. విశాఖ, విజయవాడ మెట్రోలు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. విజయవాడ మెట్రో ఫేజ్-1 కోసం రూ.11వేల కోట్లు, ఫేజ్-2 కోసం రూ.14వేల కోట్లు అవసరం.

కొమ్మాది జంక్షన్ నుంచి స్టీల్ ప్లాంట్ వరకు విశాఖ మెట్రో ఫేజ్-1 కోసం రూ.11,400 కోట్లు అవసరం. కొమ్మాది జంక్షన్ నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు విశాఖ మెట్రో ఫేజ్-2 కోసం రూ.5,700 కోట్లు కావాలి. ట్రాఫిక్ సమస్యలు తగ్గాలంటే మెట్రో వల్లే సాధ్యం. అమరావతిలో ఇంకా 3,550 ఎకరాలు సేకరించాల్సి ఉంది" అని మంత్రి నారాయణ తెలిపారు.





# గత ప్రభుత్వ భూ అక్రమాల వివరాలు త్వరలో వెల్లడిస్తాం: మంత్రి లోకేశ

విశాఖపట్నం: చంద్రబాబు అంటేనే ఒక బ్రాండ్.. ఆయన సీఎం అయ్యాక పారిశ్రామిక వేత్తలు మళ్లీ వస్తున్నారని ఐటీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. గురువారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాపాలన వచ్చిందని పారిశ్రామిక వేత్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. "రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టేలా అదానీని గతంలో ఒప్పించాం. గత ప్రభుత్వ వైఖరి వల్ల పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లాయి. రాష్ట్ర వ్యాప్తంగా భూ అక్రమాలు జరిగాయి. గత ప్రభుత్వ భూ అక్రమాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగింది. ఎన్ని ఎకరాలు ఎక్కడ అక్రమాలు జరిగాయో త్వరలో చెబుతాం. మొన్నటి వరకు విశాఖలో రాజారెడ్డి రాజ్యాంగం నడిచింది. కిడ్నాప్‌లు జరిగాయి, అడ్డగోలుగా భూములు లాక్కున్నారు. విశాఖలో దసపల్లా భూములు లాగేసుకున్నారు.

మేం ఇచ్చిన ఆరు హామీలకు కట్టుబడి ఉన్నాం. ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలి" అని లోకేశ్ అన్నారు.

# కార్మికులకు త్వరలో రూ.10లక్షల బీమాకు శ్రీకారం: సీఎం చంద్రబాబు



అమరావతి: కార్మికుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కార్మికుల హక్కులు పరిరక్షించాలన్నారు. అర్థంలేని నిబంధనలతో పరిశ్రమలపై వేధింపులు ఉండకూడదని తెలిపారు. కార్మిక శాఖపై సమీక్షించిన సీఎం అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

భద్రత విషయంలో రాజీపడొద్దని సూచించారు. ఫ్యాక్టరీస్ భద్రతా ప్రమాణాలపై థర్డ్ పార్టీతో ఆడిట్ నిర్వహించాలన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రులను బలోపేతం చేస్తామని.. రాష్ట్ర వాటా నిధులు విడుదల చేస్తామని పేర్కొన్నారు. 2019కి ముందు ఇచ్చిన చంద్రన్న బీమాను వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. పరిహారాన్ని కుదించి ఆంక్షలతో లబ్ధిదారులను తగ్గించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.10 లక్షల బీమాకు త్వరలో శ్రీకారం చుడతామన్నారు.

# ముంబయి నటికి వేధింపులు.. దర్యాప్తునకు ఏపీ ప్రభుత్వం ఆదేశం!





అమరావతి: ముంబయి సినీనటి కాదంబరీ జత్వానీకి వేధింపుల వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం స్పందించింది. పోలీసులపై తీవ్ర ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జత్వానీతో ఆన్‌లైన్‌లో ఫిర్యాదు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలు అందాయి. ఈ కేసుకు సంబంధించి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా దర్యాప్తు చేయనున్నారు. దీనిపై ఇప్పటికే విజయవాడ పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా పోలీసు బృందాలు ముంబయి వెళ్లే అవకాశాలున్నాయి.

**ఏం జరిగిందంటే? :** ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారులు తనను, తన కుటుంబసభ్యుల్ని మాఫియా తరహాలో కిడ్నాప్ చేశారని జగన్ హయాంలో నాటి ఐపీఎస్ అధికారుల అరాచకానికి బలైపోయిన ముంబయి సినీనటి కాదంబరీ జత్వానీ కన్నీటి పర్యంతమయ్యారు. తన ఇంట్లోకి చొరబడి భయభ్రాంతులకు గురిచేసిన పోలీసులు.. కుటుంబసభ్యులందరి వద్ద ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను అక్రమంగా స్వాధీనం చేసుకుని తనను, 70 ఏళ్ల వృద్ధులైన తన తల్లిదండ్రుల్ని నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.6కోట్ల విలువైన తన ఇంటిని, కుటుంబసభ్యుల బ్యాంకు ఖాతాలనూ సీజ్ చేసి వేధించారని వాపోయారు. చివరకు రోజువారీ ఖర్చులకూ అప్పుచేయాల్సిన దుస్థితి కల్పించారని చెప్పారు. విజయవాడ పోలీసులు తమ వద్ద స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాల్లోని ఆధారాలన్నింటినీ ట్యాంపర్ చేశారని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారం వెనక అత్యంత శక్తిమంతమైన వ్యక్తులు ఉన్నారని, భారీగా డబ్బులు వెచ్చించి తమను అక్రమ కేసుల్లో ఇరికించారని వెల్లడించారు. ఓ భయంకరమైన కుట్రలో తనను బాధితురాలిగా చేశారని వాపోయారు. పోలీసులు వేధింపుల వల్ల తాను, తన కుటుంబసభ్యులు ఆరు నెలల పాటు నిద్ర పోలేకపోయామని, ఎవరితోనూ మాట్లాడలేకపోయామని చెప్పారు. ఓ టీవీ ఛానెల్‌లో బుధవారం ఆమె మాట్లాడారు. ఫోర్జరీ పత్రాలు ఉపయోగించి తనపై అక్రమ కేసు పెట్టిన వైకాపా నాయకుడు కుక్కల విద్యాసాగర్‌పైన, తన కుటుంబాన్ని హింసించి, వేధించిన నాటి పోలీసు అధికారులందరిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి అనిత, ఏపీ ప్రభుత్వం తనకు న్యాయం చేయాలని విన్నవించారు.

# వైఎస్ జగన్ డైలాగ్‌ను ఆయనకే అప్పజెప్పిన గంటా..

విశాఖ: ఒకప్పుడు అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ అధినేత చేసిన సవాళ్లు అన్నీ ఇన్నీ కావు. మేము కానీ గేట్లు ఎత్తేస్తే టీడీపీప పూర్తిగా ఖాళీ అవుతుందంటూ సవాళ్లు విసిరేవారు. ఇప్పుడు అదే డైలాగ్‌ను మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జగన్‌కు అప్పజెప్పారు. తాము గేట్లు ఎత్తేస్తే వైసీపీ పూర్తిగా ఖాళీ అవుతుందని గంటా తెలిపారు. ఇవాళ ఇద్దరు ఎంపీలు మోపిదేవి వెంకట రమణ, బీద మస్తాన్ రావులు తమ పదవితో పాటు వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గంటా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో వైసీపీ మునుగుతున్న నావ అని అన్నానని.. అది ఇప్పుడు మునిగిపోయిన నావ అని ఎద్దేవా చేశారు. వైసీపీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు మా పార్టీలోకి రావడానికి వరదలాగా సిద్ధంగా ఉన్నారన్నారు. ఇలా పార్టీలోకి వచ్చిన వారు.. తమ పదవులకు రాజీనామా చేసి రావాలని తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు చెప్పారని గంటా అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి వచ్చిన వారిని స్వాగతిస్తామని పేర్కొన్నారు. మోపిదేవి వెంకట రమణ, బీదా మస్తాన్, పోతుల సునీత.. తమ పదవులకు రాజీనామా చేశారని.. మిగిలిన ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు కూడా వైసీపీని వీడుతారని గంటా జోస్యం చెప్పారు. ఆ పార్టీలో జగన్ ఒక్కరే మిగులుతారన్నారు. వైసీపీ ఈ దుస్థితికి కారణం ముమ్మాటికి ఆ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డేనని స్పష్టం చేశారు. ఇప్పటికైనా జగన్ మోహన్ రెడ్డి తన వ్యక్తిత్వాన్ని, తీరును మార్చుకోవాలని గంటా హితవు పలికారు. అలా చేస్తే కనీసం వచ్చే ఎన్నికలు నాటికైనా వైసీపీకి ప్రతిపక్ష హోదా వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి రెండు నెలలు కాకముందే.. రాష్ట్ర పతి పాలన పెట్టమనడం ఏమిటని ఫైర్ అయ్యారు. జగన్ మానసిక పరిస్థితి బాగోలేదని ఆయన చెల్లెలు షర్మిల చెప్పారని గంటా పేర్కొన్నారు.




# తెదేపాలో చేరుతున్నా: వైకాపా ఎంపీ మోపిదేవి వెంకటరమణ

ఢిల్లీ: వైకాపా ప్రాథమిక సభ్యత్వానికి, రాజ్యసభ ఎంపీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు మోపిదేవి వెంకటరమణ ప్రకటించారు. మరో ఎంపీ బీద మస్తాన్‌రావుతో కలిసి రాజీనామా చేయనున్నట్లు తెలిపారు. త్వరలో తాను తెదేపాలో చేరబోతున్నట్లు తెలిపారు. ఢిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రాజ్యసభ ఛైర్మన్‌ను కలిసి రాజీనామా లేఖలు సమర్పించనున్నట్లు చెప్పారు.

**రాజ్యసభలో వైకాపా 'రివర్స్'!** "అధికారం నాకు కొత్తేమీ కాదు.. గతంలో ఎన్నో పదవుల్లో పనిచేశాను. గత ఏడాదికాలంగా నా నియోజవర్గంలో జరుగుతున్న పరిణామాలతో ఇబ్బంది పడ్డా. కొన్ని ప్రత్యేకమైన పరిస్థితులతో రాజీనామా చేస్తున్నాను. ఎన్నికల్లో వైకాపాకు వ్యతిరేకంగా ప్రజలు ఘోరాతిఘోరమైన తీర్పు ఇచ్చారు. ఇప్పటికే చాలా మంది నేతలు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. మరికొంత మంది రాజీనామా చేశారు.

లోపం ఎక్కడ ఉందనే దానిపై వైకాపా అధిష్ఠానం విశ్లేషించుకోవాలి. అనుభవం ఉన్న నేత సీఎం చంద్రబాబు. రాష్ట్రాన్ని ఆయన గాడిలో పెడుతున్నారు. చంద్రబాబు సారథ్యంలో పనిచేయాలని భావిస్తున్నాను. త్వరలో తెదేపాలో చేరబోతున్నా. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తారని ఆశిస్తున్నా"అని మోపిదేవి అన్నారు.

# రాజ్యసభ సభ్యత్వానికి మోపిదేవి, మస్తాన్‌రావు రాజీనామా



ఢిల్లీ: రాజ్యసభ సభ్యత్వానికి వైకాపా ఎంపీలు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు రాజీనామా చేశారు. ఢిల్లీలో రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు రాజీనామా పత్రాలు సమర్పించారు. వైకాపాకు కూడా రాజీనామా చేస్తున్నట్లు వారు తెలిపారు. తెదేపాలో చేరుతున్నట్లు ఇప్పటికే మోపిదేవి వెంకటరమణ ప్రకటించారు. బీద మస్తాన్‌రావు కూడా అదే బాటలో వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

రాజీనామా సమర్పించిన అనంతరం పార్లమెంట్ వద్ద బీద మస్తాన్‌రావు మీడియాతో మాట్లాడారు. తనకు మరో నాలుగేళ్లు, మోపిదేవికి ఇంకో రెండేళ్ల పదవీకాలం మిగిలి ఉండగానే రాజీనామా చేశామన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వచ్ఛందంగా పదవులను వదులుకున్నట్లు చెప్పారు. రాజకీయ భవిష్యత్తుపై కుటుంబసభ్యులు, అనుచరులతో చర్చించాక నిర్ణయం తీసుకుంటానన్నారు. స్థానిక రాజకీయాలపై తనకు ఆసక్తి లేదని నవ్వుతూ వ్యాఖ్యానించారు. మోపిదేవి తొలి నుంచి నియోజకవర్గంలో ఉంటూ అనేక పదవులు చేపట్టారన్నారు. మరో ఆరుగురు వైకాపా ఎంపీలు కూడా తమ పదవులతో పాటు, ఆ పార్టీకి రాజీనామాలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ ఎనిమిది మందిలో నలుగురు తెదేపా వైపు, మరో నలుగురు భాజపా వైపు చూస్తున్నారని అంటున్నారు. తొలినుంచి రాజకీయాల్లో ఉన్నవారు తెదేపా, వ్యాపార వర్గాలనుంచి వచ్చినవారు భాజపా వైపు వెళ్లవచ్చని అంటున్నారు. దీనిపై ఒకట్రెండు రోజుల్లో పూర్తి స్పష్టత వచ్చే అవకాశముంది.

# త్వరలో భారత్ డోజో యాత్ర..! వీడియో షేర్ చేసిన రాహుల్ గాంధీ



ఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలకు ముందు తమ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ రెండు దఫాలుగా భారత్ జోడో యాత్రను చేపట్టింది. అయితే ఈసారి రాహుల్.. డోజో యాత్ర గురించి వెల్లడించారు. త్వరలో డోజో యాత్ర అంటూ ఒక వీడియోను షేర్ చేశారు. గత రెండేళ్లలో రాహుల్ గాంధీ.. 'భారత్ జోడో యాత్ర', 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' పేరిట భారత దేశ ప్రజల చెంతకు వెళ్లారు. న్యాయ్ యాత్రను తూర్పు భారతం నుంచి పశ్చిమ భారతం వైపు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ శిబిరాల వద్ద జరిగిన మార్షల్ ఆర్ట్స్ సెషన్లకు సంబంధించిన వీడియోను తాజాగా ఆయన షేర్ చేశారు. అలాగే త్వరలో 'భారత్ డోజో యాత్ర' రాబోతోందని వ్యాఖ్యానించారు. మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణనిచ్చే కేంద్రాలను డోజో అని పిలుస్తారు. "జోడో యాత్ర సమయంలో మేం వేల కిలోమీటర్లు ప్రయాణించాం. ఆ సమయంలో మా శిబిరాల వద్ద ప్రతిరోజు జివు-జిట్సూ (బ్రెజిల్ మార్షల్ ఆర్ట్స్)ను ప్రాక్టీస్ చేసేవాళ్లం. ఫిట్‌గా ఉండేందుకు మేం ప్రారంభించిన యాక్టివిటీ త్వరలోనే అందరికీ చేరువైంది. మేం బస చేసిన ప్రాంతాల్లోని తోటి యాత్రికులు, యువ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులను ఒకచోటకు చేర్చింది. మెడిటేషన్, జివూ-జిట్సూ, అకిడో (జపాన్ మార్షల్ ఆర్ట్స్), అహింసాపద్ధతితో ఘర్షణను పరిష్కరించే పద్ధతులు కలగలిసిన ఆర్ట్‌ను యువతకు పరిచయం చేయడమే లక్ష్యంగా వాటిని నిర్వహించాం. ఘర్షణ వాతావరణాన్ని సౌమ్యంగా మార్చే విలువల్ని వారిలో పెంపొందించాలని, దయ, సురక్షితమైన సమాజం కోసం కావాల్సిన సాధనాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని రాహుల్ పోస్టు పెట్టారు. ఈ రోజు నేషనల్ స్పోర్ట్స్ డేను పురస్కరించుకొని ఎక్స్ వేదికగా తన అనుభవాలను రాహుల్ ప్రజలతో పంచుకున్నారు. దీనిద్వారా కొందరిలోనైనా ఈ కళను అభ్యసించాలనే స్ఫూర్తి కలగాలని ఆశించారు. ఆ వీడియోలో విద్యార్థులకు రాహుల్ మార్షల్ ఆర్ట్స్ సెషన్లు నిర్వహించారు. తనకు అకిడోలో బ్లాక్ బెల్ట్ ఉందని, జివూ-జిట్సూలో బ్లూబెల్ట్ వచ్చిందని ఆ సందర్భంగా వారికి చెప్పారు. ఇదిలా ఉంటే.. 2024లో 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' మొత్తం 110 జిల్లాలు, 100 లోక్‌సభ స్థానాలు, 337 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 60 రోజులకుపైగా 6,713 కిలోమీటర్ల మేర కొనసాగింది. అంతకుముందు కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 'భారత్ జోడోయాత్ర'ను నిర్వహించిన సంగతి తెలిసిందే.

# వాస్తవాలు తెలుసుకోకుండా ప్రతిష్ఠను దెబ్బతీయడం బాధాకరం: ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట: యాదృచ్ఛికంగా జరిగిన ఘటనపై దుమారం రేగడం బాధాకరమని పల్నాడు జిల్లా చిలకలూరిపేట తెదేపా ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పుట్టినరోజు పరిణామాలు అనుకోకుండా జరిగాయని చెప్పారు. చిలకలూరిపేటలో ట్రాఫిక్ సమస్యపై సమీక్షకు పోలీసులను పిలిచానని.. పార్టీ నేతలు కేక్ తెచ్చినప్పుడు పోలీసులు అక్కడ నిలబడటం యాదృచ్ఛికమన్నారు. తమ కుటుంబంపై ఇలాంటి ప్రచారాలు బాధ కలిగిస్తున్నాయని చెప్పారు. "నేను సమర్థించడం లేదు కానీ.. కొందరు దాన్ని మరో రకంగా చిత్రీకరించారు. బదిలీల్లో జోక్యం, అక్రమ వ్యాపారాలకు కొమ్ము కాస్తున్నారనడంతో బాధేస్తోంది. నా కుటుంబం హైదరాబాద్‌లో ఉంటోంది. వారిపై ఇలా బురద జల్లడం సరికాదు. వాస్తవాలు తెలుసుకోకుండా చర్చకు పెట్టి ప్రతిష్ఠను దెబ్బతీయడం బాధాకరం. బదిలీల్లో ఎక్కడైనా నా కుటుంబసభ్యుల జోక్యం ఉంటే నిరూపించాలి. అలా నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికే కాదు.. పార్టీకి కూడా రాజీనామా చేస్తా"అని వ్యాఖ్యానించారు. ఇటీవల ఎమ్మెల్యే సతీమణి పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ఆ సమయంలో అక్కడికి కొందరు పోలీసులు వెళ్లారు. అధికారిక హోదా లేకున్నా వేడుకల్లో పాల్గొన్నారంటూ పల్నాడు జిల్లా ఎస్పీ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బర్త్‌డేలో పాల్గొన్న పోలీసులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

# ఏపీ సర్కార్‌కు డొక్కా రిక్వెస్ట్

గుంటూరు జిల్లా: ముంబైకి చెందిన సినీ నటి వేధింపులపై ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతోంది. రాజకీయ నేతలు, ఐపీఎస్ అధికారుల పేర్లు బయటకొచ్చాయి. సినీ నటి వేధింపులను అందరూ ఖండిస్తున్నారు. అధికారం అడ్డం పెట్టుకొని ఈ విధంగా చేయడం సరికాదని సూచించారు. ఆస్తులు రాయించుకొని, మానసిక క్షోభకు గురిచేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. తప్పు చేసిన వారిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

**సరికాదు..** సినీ నటి నత్వాని అంశంపై మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ స్పందించారు. వైసీపీ నేతలు, పోలీసులు ప్రవర్తించిన తీరు హేయనీయం అని మండిపడ్డారు. ముంబై నుంచి తీసుకొచ్చి కిడ్నాప్ చేయడం ఏంటీ అని నిలదీశారు. ఆ అమ్మాయి ఆస్తులను రాయించుకొని.. బెదిరింపులకు గురిచేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి నేతృత్వంలో సినీ నటికి వేధింపుల ప్రక్రియ కొనసాగిందని మండిపడ్డారు. సజ్జల రామకృష్ణారెడ్డి, ఐపీఎస్‌లపై చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళపై అనుచితంగా ప్రవర్తించేందుకు వారికి మనసెలా వచ్చిందని డొక్కా నిలదీశారు. సజ్జలను ఆయన సతీమణి ఆరు నెలలు వదిలి వేయాలని, అప్పుడు అయినా ఆయనకు చేసింది తప్పు అని తెలిసే అవకాశం ఉందన్నారు. ఐపీఎస్ అధికారులతో కూడా వారి భార్యలు ఇదే విధంగా ప్రవర్తించాలని సూచించారు. చట్ట ప్రకారంగా కూడా శిక్షించాలని డొక్కా కోరారు. ఇలాంటి తప్పు చేసేందుకు మరొకరు భయపడాలన్నారు.

**చేరికలు కంటిన్యూ...** వైసీపీలో చేరికలు ఆరంభం మాత్రమేనని డొక్కా మాణిక్య వరప్రసాద్ అభిప్రాయ పడ్డారు. మోపిదేవి వెంకట రమణ బీద మస్తాన్ రావుకు సాదరంగా ఆహ్వానం పలుకుతున్నానని ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని బ్రతికించాలంటే వైసీపీకి దూరం కావాల్సిందేనని స్పష్టం చేశారు. వైసీసీ కండువాలు వేసుకొని గత ఐదేళ్ల అరాచకాలు చేసిన ఐపీఎస్ అధికారులకు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు.

గరుడ వార్త



# వావ్.. రకుల్ సో గ్లోరియస్.. అవార్డు కూడా!

కెరటం మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన పంజాబీ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్.. ఆ తర్వాత వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ తో సూపర్ హిట్ అందుకుంది. నాన్నకు ప్రేమతో, సరైనోడు, ధృవ సినిమాలతో మంచి క్రేజ్ సంపాదించుకుంది. కమర్షియల్ హిట్స్ సాధించి స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. తెలుగు, తమిళ భాషల్లో వరుస సినిమాలు చేస్తున్న సమయంలో బాలీవుడ్ ఆఫర్స్ రావడంతో అక్కడికి చెక్కేసింది అమ్మడు. కొండపొలం చిత్రం తర్వాత ఒక్క తెలుగు మూవీలో కూడా నటించని రకుల్.. మంచి స్టోరీ దొరికితే మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఇండియన్-2 మూవీలో నటించి ఫ్లాప్ మూటగట్టుకుంది. అంతే కాదు సీక్వెల్ లో ఆమె నటిస్తే.. సినిమా ఫ్లాప్ అయిపోతుందన్న అపవాదు అందుకుంది! అయితే బాలీవుడ్ లో వరుస సినిమాలు చేస్తున్నా.. కమర్షియల్ హిట్స్ అందుకోవడంలో మాత్రం ఫెయిల్ అవుతోంది రకుల్ ప్రీత్ సింగ్. రీసెంట్ గా నెక్సా అవార్డు అందుకుంది అమ్మడు.



గత ఏడాది ఆమె నటించిన ఛత్రీవాలి సినిమాకు గాను అవార్డు గెలుచుకుంది. ఆ అవార్డు పట్టుకుని పిక్స్ దిగి షేర్ చేసింది రకుల్. ఇక స్టైల్ విషయంలో ఏ మాత్రం తగ్గిన అమ్మడు.. నెక్సా అవార్డు ఫంక్షన్ కు ఆరెంజ్ కలర్ స్లీవ్ లెస్ బాడీ కాన్ డ్రెస్ లో వెళ్లింది. థై స్లిట్ గౌనులో ఈవెంట్ కు వెళ్లిన అమ్మడు.. అక్కడ ఉన్న వారందరినీ ఫిదా చేసింది. అదే సమయంలో ఫోటో షూట్ దిగి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. స్టైలిష్ డ్రెస్ లో అదిరిపోయే పోజులిచ్చింది రకుల్. ఔట్ ఫిట్ కు తగ్గట్టు ఇయర్ రింగ్స్ పెట్టుకుంది. సింపుల్ గా ఒక్క బ్రాస్లెట్ మాత్రమే ధరించి అందంగా కనిపించింది. గ్లోయింగ్ స్కిన్, థై షోతో ఫిదా చేస్తోంది. ఓ రేంజ్ లో ఎక్స్ప్రెషన్స్ ఇస్తూ కుర్రాళ్లను క్లీన్ బౌల్డ్ చేస్తోంది. కొంటెగా చూస్తూ మాయ చేస్తోంది. క్యూట్ గా నవ్వుతూనే సెగలు రేపుతోంది. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ కొత్త పిక్స్ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. డ్రెస్ కన్న రకుల్ స్టిల్స్ కేక అని నెటిజన్లు చెబుతున్నారు. ఏ డ్రెస్ లో అయినా అమ్మడు అందమేనని అంటున్నారు. చూపులతో మైండ్ బ్లాక్ చేస్తుందని కామెంట్స్ పెడుతున్నారు. సింపుల్ అండ్ షైనీ బ్యూటీ అంటూ పొగిడేస్తున్నారు. అమ్మడిని పొగడ్తలతో ఆకాశానికెత్తేస్తున్నారు. అవార్డు వచ్చినందుకు కంగ్రాట్స్ చెప్తూ లైకులు కొడుతున్నారు. మరి రకుల్ కు అవార్డు వచ్చేలా చేసిన ఛత్రీవాలి సినిమా జీ ఫైవ్ ఓటీటీ లో స్ట్రీమింగ్ అవుతోంది. మీరు ఆ మూవీని చూశారా?

# ఎన్టీఆర్ తో డాన్స్ అంటే.. జాన్వీ క్రేజీ కామెంట్

ప్రస్తుతం ఇండియాలో బెస్ట్ డాన్సర్స్ అయిన స్టార్ హీరోలు ఎవరంటే వెంటనే తెలుగు హీరోల వైపు అందరూ చూపిస్తారు. టాలీవుడ్ లో అల్లు అర్జున్, రామ్ చరణ్, ఎన్టీఆర్ టాప్ డాన్సర్స్ గా ఉన్నారు. హిందీలో డాన్స్ అంటే హృతిక్ రోషన్ పేరు ప్రముఖంగా వినిపిస్తూ ఉంటుంది. ఈ నలుగురుని బీట్ చేసే డాన్సర్స్ ప్రస్తుతం ఇండియన్ సిల్వర్ స్క్రీన్ పై లేరని చెప్పొచ్చు. మెగాస్టార్ తర్వాత ఆ స్థాయిలో ఛరిష్మాటిక్ డాన్స్ తో అదరగొట్టే స్టార్స్ అంటే వీళ్ళే కనిపిస్తారు. అయితే వీరందరిలో బెస్ట్ డాన్సర్ అంటే ఎక్కువ మంది జూనియర్ ఎన్టీఆర్ పేరు చెబుతారు. తారక్ ఎలాంటి రిహార్సల్స్ లేకుండానే క్లిష్టతరమైన స్టెప్పులు అయిన కూడా ఈజీగా చేస్తాడని చాలా మంది ప్రశంసిస్తూ ఉంటారు. అల్లు అర్జున్, రామ్ చరణ్ అయితే డాన్స్ ప్రాక్టీస్ ముందుగానే చేస్తారు. తారక్ మాత్రం ఆన్ సెట్ లోనే అప్పటికప్పుడు స్టెప్పులు వేసి మెప్పిస్తాడు. అందుకే తారక్ తో డాన్స్ చేయడం చాలా కష్టం అని హీరోయిన్స్ సైతం అంటూ ఉంటారు. అలాగే జూనియర్ ఎన్టీఆర్ తో డాన్స్ చేయడాన్ని ఆస్వాదిస్తామని



చెబుతారు. కొరియోగ్రాఫర్స్ కూడా జూనియర్ ఎన్టీఆర్ కోసం అదిరిపోయే స్టెప్పులు డిజైన్ చేస్తారు. ఇదిలా ఉంటే తారక్ ప్రస్తుతం దేవర సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ మూవీ సాంగ్ షూట్ చేసారంట. ఈ సాంగ్ కి బాలీవుడ్ కొరియోగ్రాఫర్ బాస్కో డాన్స్ కంపోజ్ చేశాడు. ఇది వరకు తెలుగులో శ్రీమంతుడు, ధృవ సినిమాలకి అతను వర్క్ చేశాడు. ఓ ఇంటర్వ్యూలో బాస్కో ఎన్టీఆర్ డాన్స్ పై ప్రశంసలు కురిపించారు. దేవర మూవీ కోసం ఎన్టీఆర్ తో వర్క్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఓ సాంగ్ కోసం క్లిష్టతరమైన స్టెప్పులని కూడా చాలా ఈజీగా కంపోజ్ చేసాను. ఇదంతా ఎన్టీఆర్ వలనే సాధ్యం అయ్యింది. సినిమాలో ఎన్టీఆర్ డాన్స్ అదిరిపోతుంది. కచ్చితంగా అందరూ ఎంజాయ్ చేస్తారని బాస్కో చెప్పుకొచ్చారు. అలాగే దేవర సినిమాలో హీరోయిన్ గా నటిస్తోన్న జాన్వీ కపూర్ కూడా ఎన్టీఆర్ డాన్స్ పై ప్రశంసలు కురిపించింది. విక్కీ కౌశల్, హృతిక్ రోషన్ లో ఎవరితో మీరు డాన్స్ చేయడానికి ఇష్ట పడతారు అని యాంకర్ ఓ ఇంటర్వ్యూలో అడిగారు. తాను జూనియర్ ఎన్టీఆర్ తో డాన్స్ చేయడానికి ఇష్టపడతానని జాన్వీ కపూర్ చెప్పింది. ఇప్పటికే దేవర మూవీలో ఒక సాంగ్ లో ఎన్టీఆర్ తో కలిసి డాన్స్ చేశాను. మరో సాంగ్ కూడా ఉంది. అందులో అతనితో కలిసి డాన్స్ చేయడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్న అని జాన్వీ కపూర్ చెప్పుకొచ్చింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.




# గేమ్ ఛేంజర్.. ఏదో ఒకటి చేయండి



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సినిమా కోసం మెగా ఫ్యాన్స్ వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. ఆర్ఆర్ఆర్ లాంటి మరో బ్లాక్ బస్టర్ హిట్ ని పాన్ ఇండియా లెవల్ లో రామ్ చరణ్ అందుకుంటే చూడాలని కోరుకుంటున్నారు. శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతోన్న గేమ్ చేంజర్ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. భారీ బడ్జెట్ తో దిల్ రాజు ఈ చిత్రాన్ని పాన్ ఇండియా లెవల్ లో నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ మూవీ షూటింగ్ ఎప్పుడో స్టార్ట్ అయ్యింది. అయితే రకరకాల కారణాలతో మూవీ షూటింగ్ ను ఇంకా కొనసాగిస్తున్నారు. మెగా హీరో సినిమా వస్తుందంటే ఫ్యాన్స్ లో ఒక రకమైన వైబ్రేషన్ ఉంటుంది. అలాంటిది గేమ్ చేంజర్ విషయంలో మాత్రం మెగా ఫ్యాన్స్ లో అంత ఉత్సాహం లేదు. దీని తర్వాత బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్ చరణ్ చేయబోయే %=జ%16పైన ఉన్నంత బజ్ కూడా గేమ్ చేంజర్ చిత్రం పైన లేకపోవడం గమనార్హం. శంకర్ నుంచి గత నెల వచ్చిన ఇండియన్ 2 డిజాస్టర్ ఎఫెక్ట్ గేమ్ చేంజర్ మీద బాగా పడిందనే మాట వినిపిస్తోంది. అందుకే ఈ సినిమాపై సోషల్ మీడియాలో కూడా పెద్దగా చర్చ జరగడం లేదు. అలాగే చిత్ర యూనిట్ కూడా మొదటి నుంచి గేమ్ చేంజర్ అప్డేట్స్ విషయంలో చాలా స్లోగా ఉన్నారు. సినిమాని జనాల్లోకి బలంగా తీసుకొని వెళ్లి హైప్ క్రియేట్ చేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఎక్కడా కనిపించడం లేదు. ఈ సినిమాకి థమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. గతంలో గేమ్ చేంజర్ నుంచి జరగండి జరగండి అనే సాంగ్ ఫస్ట్ సింగిల్ గా రిలీజ్ అయిన ఇంపాక్ట్ క్రియేట్ చేయలేదు. ఆగష్టు నెల ఆఖరులో సెకండ్ సింగిల్ అప్డేట్ ఉంటుందని భావించన శంకర్ టీమ్ నుంచి ఎలాంటి క్లారిటీ లేదు. ఇదిలా ఉంటే వినాయక చవితి సందర్భంగా సెప్టెంబర్ 7న గేమ్ చేంజర్ నుంచి ఏదో ఒక కంటెంట్ ని రిలీజ్ చేయాలని చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోందంట. ఫెస్టివల్ సందర్భంగా అంటే పండగ హడావిడి ఉంటుంది. ఆ టైంలో కాస్తా వైరల్ అయ్యే విధంగా ఏదైనా కంటెంట్ రిలీజ్ చేస్తే బాగుంటుందనే అభిప్రాయం మెగా ఫ్యాన్స్ వ్యక్తం చేస్తున్నారు. గేమ్ చేంజర్ మీద ఇప్పటి వరకు మినిమమ్ బజ్ కూడా లేదు. ఈ మధ్య శంకర్ మళ్ళీ రీషూట్స్ పెడుతున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. ఇలాంటి టైంలో సినిమాపై ఏ మాత్రం హైప్ క్రియేట్ చేయకపోయిన రిలీజ్ టైంకి ఎవరు కూడా పట్టించుకోవడం మానేసే ప్రమాదం ఉందని సినీ విశ్లేషకులు అంటున్నారు. ఆర్ఆర్ఆర్ తర్వాత చిరంజీవి, రామ్ చరణ్ కాంబోలో వచ్చిన ఆచార్య మీద కూడా రిలీజ్ కి ముందు మంచి బజ్ క్రియేట్ అయ్యింది. కానీ ఎందుకనో గేమ్ చేంజర్ మాత్రం ఎలాంటి హైప్ ని అందుకోలేకపోతోంది.

# ఇండియాలోనే నెం.1.. 'పుష్ప 2' తగ్గేదేలే!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ "పుష్ప 2: ది రూల్". ఇది 'పుష్ప: ది రైజ్' చిత్రానికి సీక్వెల్. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దీనికి తగ్గట్టుగానే ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ పార్ట్ ఊహించని విధంగా బాక్సాఫీస్ దగ్గర భారీ బ్లాక్ బస్టర్ గా నిలవడంతో, ఇప్పుడు అందరూ సెకండ్ పార్ట్ కోసం ఆతృతగా వేచి చూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 2024లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారతీయ చిత్రంగా 'పుష్ప 2' నిలిచింది. ప్రముఖ మూవీ రేటింగ్ సంస్థ ఐఎండీబీ తాజాగా 2024లో సినీ ప్రియులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న టాప్-10 ఇండియన్ సినిమాల జాబితాను ప్రకటించింది. ఇందులో 'పుష్ప 2: ది రూల్' చిత్రం అగ్ర స్థానంలో నిలిచింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్, డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్ లో రూపొందుతున్న 'దేవర 1' మూవీ రెండో స్థానాన్ని ఆక్రమించింది. అక్షయ్ కుమార్ నటిస్తున్న హిందీ చిత్రం 'వెల్ కమ్ టూ ది జంగిల్' థర్డ్ ప్లేస్ లో ఉంది. కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ హీరోగా వెంకట్ ప్రభు తెరకెక్కిస్తున్న 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' మూవీ నాలుగో స్థానాన్ని సంపాదించింది. తమిళ హీరో సూర్య, సిరుతై శివ కాంబోలో రాబోతున్న సైన్స్ ఫిక్షన్ మూవీ 'కంగువ' ఈ ఏడాది మోస్ట్ యాంటిసిపేటెడ్ అప్ కమింగ్ ఇండియన్ మూవీస్ లిస్టులో ఐదో ప్లేస్ లో నిలిచింది. రోహిత్ శెట్టి దర్శకత్వంలో బాలీవుడ్ స్టార్స్ అజయ్ దేవగణ్, రణవీర్ సింగ్, దీపికా పదుకునే, కరీనా కపూర్ ఖాన్ కలిసి నటిస్తున్న హిందీ సినిమా 'సింగం అగైన్' ఆ తర్వాతి స్థానంలో ఉంది. కార్తీక్ ఆర్యన్ చేస్తున్న హారర్ కామెడీ మూవీ 'భూల్ భూలయ్యా 3' ఏడో స్థానాన్ని సాధించింది. చియాన్ విక్రమ్, డైరెక్టర్ పా. రంజిత్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'తంగలాన్' ఐఎండీబీ జాబితాలో 8వ స్థానంలో నిలిచింది. అజయ్ దేవగన్, టబు కలిసి నటించిన 'ఔరోన్ మే కహన్ దమ్ థా' సినిమా 9వ ప్లేస్ లో ఉండగా.. శ్రద్ధా కపూర్, రాజ్ కుమార్ రావ్ ప్రధాన పాత్రల్లో రూపొందిన 'స్త్రీ 2' చిత్రం ఈ లిస్టులో చివరి ప్లేస్ లో ఉంది. 2024 జనవరి 1 నుంచి 2024 జూలై 10 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా వందల మిలియన్ల మంది విజిటర్స్ వాస్తవ పేజీ వ్యూస్ ఆధారంగా ఈ జాబితా రూపొందించినట్లుగా %×వీణదీ% పేర్కొంది. అయితే ఈ లిస్టులో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ శంకర్ కాంబోలో రూపొందుతున్న 'గేమ్ చేంజర్' సినిమాకి ఈ జాబితాలో చోటుదక్కకపోవడం గమనార్హం. ఇకపోతే 2021 డిసెంబర్ లో వచ్చిన 'పుష్ప: ది రైజ్' సినిమా బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించింది. ముఖ్యంగా నార్త్ బెల్ట్ లో ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజై, సంచలనం సృష్టించింది. పుష్పరాజ్ గా అల్లు అర్జున్ అద్భుతమైన నటనకు పాన్ ఇండియా ఆడియన్స్ ఫిదా అయ్యారు. ఇదే 69 ఏళ్లుగా టాలీవుడ్ కు అందని ద్రాక్షగా ఉన్న జాతీయ ఉత్తమ నటుడి అవార్డు తెచ్చిపెట్టింది. ఇక ఈ సినిమాలో 'తగ్గేదే లే' అనే బన్నీ మేనరిజం.. ఆయన పలికిన 'పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా.. ఫైర్' వంటి డైలాగ్స్ ప్రపంచ వ్యాప్తంగా చిన్న పిల్లల దగ్గర నుంచి సినీ క్రీడా సెలబ్రిటీల వరకూ అందరి దృష్టిని ఆకర్షించారు. అందుకే ఇప్పుడు "పుష్ప 2: ది రూల్" కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇదే ఐఎండీబీ ద్వారా మరోసారి స్పష్టమైంది. 2024లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారతీయ చిత్రంగా 'పుష్ప 2' నిలిచిన నేపథ్యంలో చిత్ర బృందం ఎక్స్ లో పోస్ట్ పెట్టింది. 'తగ్గేదే లే' అంటూ పుష్పరాజ్ టైటిల్ సాంగ్ క్లిప్పింగ్ ని షేర్ చేసింది. ఈ సందర్భంగా డిసెంబర్ 6న తేదీన వరల్డ్ వైడ్ గా అల్లు అర్జున్ సినిమా రిలీజ్ అవుతుందని మరోసారి క్లారిటీ ఇచ్చింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తుండగా.. మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూరుస్తున్నారు. 'పుష్ప 2: ది రూల్' మూవీ కచ్చితంగా 1000 కోట్ల క్లబ్ లో చేరుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# సమంత రహస్య ప్రపంచం ఎవరికైనా తెలుసా?

సమంత రూత్ ప్రభు ఎవరికీ తెలియని ఓ రహస్య ప్రపంచంలోకి వెళ్లిపోతోందా? అంటే అవుననే అంటున్నారు. అయితే ఎప్పుడు.. ఎక్కడ.. ఎలా? అనే సందేహాలు ఎవరికైనా కలగడం సహజం. వివరాల్లోకి వెళితే.. సమంత రూత్ ప్రభు ఇటీవల కొన్ని వ్యక్తిగత ఎపిసోడ్ల తర్వాత 'ఖుషి' అనే రెగ్యులర్ కమర్షియల్ సినిమాలో నటించింది. ఆ తర్వాత బాలీవుడ్ కి వెళ్లిపోతోంది అంటూ ప్రచారం సాగినా అవన్నీ పుకార్లుగానే మిగిలాయి. అక్కడ సల్మాన్, షారూఖ్ వంటి పెద్ద స్టార్ల సరసన నటించే అవకాశం ఉందని కూడా ప్రచారం సాగింది. కానీ ఏదీ వర్కవుట్ కాలేదు. కానీ ఇప్పుడు తన స్నేహితులు రాజ్ అండ్ డీకేతో కలిసి ముచ్చటగా మూడోసారి పాన్ ఇండియన్ ప్రాజెక్ట్ కోసం పని చేయనుంది. అది కూడా ఓ వెబ్ సిరీస్ కోసం. ఈ సిరీస్ నిజంగా ఉత్కంఠ రేకెత్తించే ఎలిమెంట్స్ తో తెరకెక్కనుంది. ఇంకా చెప్పాలంటే అనేక అవార్డులు రివార్డులతో సంచలనం సృష్టించిన 'తుంబాద్' తరహాలో ఒక రహస్య ప్రపంచంలో సాగే కథలోకి సమంత వెళ్లిపోనుందట. ఇందులో సామ్ పాత్ర కూడా అంతే ప్రత్యేకంగా ఉంటుందని చెబుతున్నారు. ఈసారి తుంబాద్ దర్శకుడు రాహి అనీల్



బార్వే రూపొందించనున్న తాజా వెబ్ సిరీస్ టైటిలే ఉత్కంఠను పెంచింది. రక్త్ బ్రహ్మాండ్-అనేది టైటిల్. టైటిల్ కి తగ్గట్టే కథాంశం ఉత్కంఠ కలిగిస్తుందని చెబుతున్నారు. అభిమానం, కుట్రలు, ప్రేమ, త్యాగం, విధితో కూడిన ఉత్కంఠభరితమైన కథను తెరపై చూపించనున్నారట. ఒక ప్రత్యేకమైన రహస్య ప్రపంచంలోకి ఆడియెన్ ని తీసుకెళ్లేందుకు క్షణక్షణం టెన్షన్ ను అనుభవించేందుకు అవసరమైన సరంజామాను దర్శకుడు సిద్ధం చేసారట. దీనిని తొలుత సినిమాగా తీయాలనుకున్నా కథ స్పాన్ పరంగా పునరాలోచించి ఒక వెబ్ సిరీస్ అయితే న్యాయం చేయగలమని దర్శకనిర్మాతలు ఇలా ప్లాన్ చేసారని తెలిసింది. అయితే ఈ సిరీస్ లో సమంత పాత్ర ఎలా ఉంటుందో మాత్రం దర్శకుడు ఇంకా రివీల్ చేయలేదు. ఇందులో ఆదిత్య రాయ్ కపూర్, వామికా గబ్బి ఇతర పాత్రధారులు. రాజ్ అండ్ %ఙఖ% క్రియేటివ్ పార్ట్ లో ఉన్నారు. నిర్మాతలుగా కొనసాగుతారు. ఫ్యామిలీమ్యాన్ 2, సిటాడెల్: హనీ బన్నీ తర్వాత రాజ్ అండ్ డీకేతో సమంతకు మూడో అవకాశం ఇది. మరోసారి తన బ్రాండ్ ని పెంచే సిరీస్ ని వారు అందిస్తారని సమంత నమ్మకంగా ఉంది. ముఖ్యంగా తుంబాద్ దర్శకుడి క్రియేటివ్ ప్రపంచం తనకు మంచి పేరు తెస్తుందని కూడా సమంత భావిస్తోందట. సమంత ఈ సిరీస్ తో పాటు ఒకే ఒక్క సినిమాలో నటిస్తోంది. అది కూడా తన సొంత బ్యానర్ సినిమా. బంగారం అనే టైటిల్ ని ప్రకటించిన సంగతి తెలిసిందే.

# నయన్ డిమాండ్ మాత్రం తగ్గదంతే..?

లేడీ సూపర్ స్టార్ నయనతార సౌత్ లో ఏ హీరోయిన్ సంపాదించలేని క్రేజ్ తెచ్చుకుంది. సోలో సినిమాలతో స్టార్ హీరోలకు కూడా గట్టి పోటీ ఇచ్చిన అమ్మడు అప్పటికీ ఇప్పటికీ అదే రేంజ్ లో అదరగొట్టేస్తుంది. పెళ్లి తర్వాత కాస్త దూకుడు తగ్గినట్టు అనిపించిన నయన్ మళ్లీ తిరిగి ఫాంలోకి వచ్చేలా సినిమాలు చేస్తుంది. బాలీవుడ్ లో ఆమె చేసిన జవాన్ సినిమా సక్సెస్ అవ్వడంతో అక్కడ నుంచి కూడా ఆఫర్లు వస్తున్నాయి. ఐతే బాలీవుడ్ కన్నా సౌత్ సినిమాలే ముఖ్యంగా తమిళ సినిమాలే బెటర్ అని భావిస్తుంది నయనతార. ఈమధ్య ఒక బాలీవుడ్ ప్రొడక్షన్ నుంచి భారీ ఆఫర్ రాగా ఆ ఛాన్స్ వదులుకుందట నయనతార. కారణాలు ఏంటన్నది తెలియదు కానీ ఆ హిందీ సినిమాలో తనకు నటించే ఆసక్తి లేదని చెప్పేసిందట. ఐతే నయన్ కోసం వారు భారీ రెమ్యునరేషన్ ఆఫర్ ఇచ్చారని టాక్. ఐతే నయనతార సినిమాలు చేస్తూ రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తుంది కానీ కేవలం రెమ్యునరేషన్ కోసం ఏ సినిమా చేయదు. అందుకే ఆ ఆఫర్ ని సున్నితంగానే తిరస్కరించిందట అమ్మడు. ఇక కోలీవుడ్ విషయానికి



వస్తే ప్రస్తుతం అక్కడ రెండు సినిమాలు చేస్తున్న నయనతార మరో రెండు కథలను చర్చల్లో ఉంచింది. ఈమధ్య తమిళ్ లో కూడా తన దూకుడు తగ్గిందని వార్తలు వచ్చినా ఇలాంటి టైం లోనే అమ్మడు మరింత పనిచేయాలని అనుకుంటుంది. టాలీవుడ్ నుంచి అవకాశాలు వచ్చినా వాటిని సరిగా పట్టించుకోని నయనతార ఇప్పుడు తెలుగు ఆఫర్ వచ్చినా చేసేందుకు రెడీ అని అంటుంది. భర్త విఘ్నేష్.. ఇద్దరు పిల్లలతో ఓ పక్క ఫ్యామిలీ లైఫ్ ని కూడా ఎంజాయ్ చేస్తున్న నయనతార కెరీర్ లో కాస్త స్పీడ్ పెంచాల్సినే అని అంటున్నారు ఆమె ఫ్యాన్స్. నయన్ చేస్తున్న సినిమాలు అవి తెస్తున్న ఫలితాలు ఆమె ఫ్యాన్స్ కి సంతృప్తికరంగా ఉన్నాయి. ఎప్పటికప్పుడు ప్రయోగాలు చేసేందుకు ఇంట్రెస్ట్ చూపించే నయనతార అటు కమర్షియల్ సినిమాల్లోనూ ఛాన్స్ వస్తే చేస్తానని చెబుతుంది. పాన్ ఇండియా సినిమాల హంగామా నడుస్తున్న ఈ టైం లో ఇటు తెలుగులో కానీ అటు తమిళ్ లో కానీ ఎలాంటి సినిమా వచ్చినా నేషనల్ లెవెల్ క్రేజ్ ఉన్న నయనతార బెస్ట్ ఆప్షన్ అని చెప్పొచ్చు. అయితే కథల విషయంలో ఆమె చాలా శ్రద్ధగా ఉంటుంది కాబట్టి తన దగ్గరకు వచ్చిన ప్రతి సినిమా ఓకే చెప్పే ఛాన్స్ లేదని తెలుస్తుంది.




# సీఎం రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్ట్ షాక్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కే కవితకు బెయిల్ వచ్చిన విషయం తెలిసిందే. అయితే మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేంద్రంలోని అధికార బీజేపీ మధ్య డీల్ కుదరడంతోనే బెయిల్ వచ్చిందంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్ట్ స్పందించింది. వ్యక్తులు, రాజకీయ పార్టీల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని నిందితులకు తాము బెయిల్ ఇస్తామా అని ప్రశ్నించింది. 2015 నాటి ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయమూర్తులు జస్టిస్ బైఆర్ గవాయ్, పీకే మిశ్రా, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను న్యాయమూర్తులు తప్పుబట్టారు. సీఎం రేవంత్ రెడ్డి తరపున వాదించిన లాయర్లు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి సుప్రీంకోర్టు పట్ల గౌరవంతో ఉండాలని, రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఎంత మాత్రం సరికాదని కోర్ట్ వ్యాఖ్యానించింది. "ఇలాంటి ప్రవర్తన కలిగిన వ్యక్తి సీఎం పదవిలో ఉన్నారు. కాబట్టి కేసును బదిలీ చేయాలంటూ పిటిషనర్ కోరినట్టు వేరే రాష్ట్రానికి బదిలీ చేయమంటారా?" అంటూ అడ్వకేట్లు ముకుల్ రోహత్గీ, సిద్దార్థ్ లూథ్రాలను న్యాయమూర్తులు ప్రశ్నించారు. మరోసారి ఇలా జరగదని వారు కోర్టుకు హామీ ఇచ్చారు. ఆయన (ముఖ్యమంత్రి) చేసిన ప్రకటనలు బహిరంగంగా ప్రచురితమయ్యాయని, పోలీసులు ఏదైనా చేస్తే వారిని వీధిలో కొడతారేమో అని సుప్రీంకోర్ట్ వ్యాఖ్యానించింది. " ఆయన ఏమన్నారో మీరు చదివారా. ఒకసారి చదవండి. ఒక ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే అనుమానాలు కలగజేస్తాయి" అని జస్టిస్ గవాయి అన్నారు.

**పరస్పర గౌరవం ఉండాలి :** " రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి ప్రకటనలు చేయాలా?. రాజకీయ నాయకులు, న్యాయవ్యవస్థ మధ్య పరస్పర గౌరవం ఉండాలి. రాజకీయ కారణాలతో మేము ఆదేశాలు జారీ చేశామని ఏ వ్యక్తైనా ఎలా చెప్పగలరు?. మీరు మమ్మల్ని గౌరవించనంత మాత్రాన మేము మీ కేసు విచారణను వేరే చోటికి బదిలీ చేస్తామా. ఇది దేశంలోనే అత్యున్నత న్యాయస్థానం. నిన్ననే మహారాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శికి (అటవీ, రెవెన్యూ శాఖ) నోటీసులు జారీ చేశాం. ఏదైనా రాజకీయ పార్టీని సంప్రదించిన తర్వాత మా ఆదేశాలను జారీ చేస్తామా?. మనస్సాక్షి, ప్రమాణం చేసిన విధంగా మేము మా విధులను నిర్వహిస్తాం" అని సుప్రీంకోర్ట్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

కాగా ఓటుకు నోటు కేసు బదిలీపై విచారణ విషయానికి వస్తే రేవంత్ రెడ్డి సాక్షులను ప్రభావితం చేయగలరని, సాక్ష్యాలను తారుమారు చేయగలరని పిటిషనర్ల తరపు లాయర్లు వాదించారు. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు సుప్రీంకోర్ట్ తెలిపింది.




**భారాస ఎమ్మెల్సీ కవిత ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి చేరుకున్నారు. దిల్లీ మద్యం కేసులో సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేయడంతో తిహాడ్ జైలు నుంచి విడుదలైన ఆమె.. గురువారం కేసీఆర్ వద్దకు వచ్చారు. ఇక్కడ ఆమెకు ఆత్మీయ ఆహ్వానం లభించింది. కుమార్తెను చూడగానే అక్కున చేర్చుకుని కేసీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. తండ్రి కేసీఆర్ పాదాలకు నమస్కరించి కవిత ఆశీర్వాదం తీసుకున్నారు.**




హైదరాబాద్: దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ నోటీసులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి స్పందించారు. "అమర్ సొసైటీలో ఇంటిని కొనుగోలు చేశా. నాకు ఇల్లు అమ్మిన యజమాని అన్ని అనుమతులతోనే ఇంటిని నిర్మించారు. కొనుగోలు చేసేటప్పుడు బఫర్ జోన్‌లో ఉందని చెప్పలేదు. నా ఇల్లు బఫర్ జోన్‌లో ఉందని ఇప్పుడు నోటీసులు వచ్చాయి. నిబంధనల ప్రకారం లేకుంటే కూల్చేయవచ్చు. సమయం ఇస్తే ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోతా. భారాస నేతలు నన్ను లక్ష్యంగా చేసుకొని అమర్ సొసైటీ వాళ్లను ఇబ్బంది పెడుతున్నారు. నన్ను లక్ష్యంగా చేసుకోకపోతే మిగతా వాళ్లు ఇబ్బంది పడేవాళ్లు కాదు" అని తిరుపతిరెడ్డి అన్నారు. తిరుపతిరెడ్డి ఇంటికి 'హైడ్రా' అధికారులు గురువారం నోటీసులు అంటించారు. మాదాపూర్‌లోని అమర్ కో-ఆపరేటివ్ సొసైటీలో ఆయన నివాసముంటున్నారు. ఆ ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో నోటీసులు అంటించారు.

మరో వైపు దుర్గం చెరువును ఆనుకుని ఉన్న కావూరి హిల్స్, నెక్టర్స్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, అమర్ సొసైటీ వాసులకు కూడా నోటీసులు జారీ చేశారు. నెలలోపు అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని నోటీసుల్లో హైడ్రా అధికారులు పేర్కొన్నారు.




# 160 రోజుల తరువాత కవిత పోస్ట్..

**హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసిన తరువాత బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసానికి చేరుకున్న విషయం విదితమే. దాదాపు 5 నెలలకుపైగా జైలు శిక్ష అనుభవించిన కవిత.. 160 రోజుల తరువాత గురువారం తన సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. తన భర్త అనిల్, సోదరుడు కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు తన నివాసం వద్ద ఉండగా తీసిన ఫొటోను ఆమె తన పోస్ట్‌కి జత చేశారు. 'సత్యమేవ జయతే'అనే క్యాప్షన్‌ని పోస్ట్‌కి ఇచ్చారు. కవితకు బెయిల్ రావడంతో సత్యం గెలిచిందని బీఆర్ఎస్ నేతలు అన్నారు.**

## హైడ్రా పేరుతో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: హైడ్రా పేరు చెప్పి కొందరు అవినీతికి పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో ఇచ్చిన నోటీసులను అడ్డుపెట్టుకొని డబ్బులు అడుగుతున్నట్లు తెలిసిందన్నారు. అమాయకులను భయపెట్టి డబ్బు



వసూలు చేస్తున్నారని, కొన్ని చోట్ల రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులపై కూడా ఫిర్యాదులు వచ్చాయని సీఎం చెప్పారు. అక్రమంగా డబ్బు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వసూళ్లకు పాల్పడే వారిపై దృష్టి పెట్టాలని ఏసీబీ, విజిలెన్స్ అధికారులను సీఎం ఆదేశించారు.

## హైడ్రా కూల్చివేతలపై సీఎస్ శాంతి కుమారి కీలక సమావేశం

హైదరాబాద్: హైడ్రా కూల్చివేతలపై సీఎస్ శాంతి కుమారి కీలక సమావేశం నిర్వహించారు. కూల్చివేతలపై తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో అధికారులతో ఆమె సమావేశమయ్యారు. నిబంధనల ప్రకారమే ముందుకెళ్లాలని హైడ్రాకు ఇటీవల ఉన్నత న్యాయస్థానం



స్పష్టం చేసింది. ఈక్రమంలో వివిధ అంశాలపై చర్చించేందుకు హైడ్రా, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సీఎస్ భేటీ అయ్యారు. న్యాయపరమైన సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. సమావేశానికి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు.

# నువ్వే అసలు దొంగ.. సీఎం రేవంత్‌పై హరీష్ కన్నెర్ర..!

హైదరాబాద్, ఆగష్టు 28: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. రుణమాఫీ విషయంలో తనపై రేవంత్ చేసిన వ్యాఖ్యలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డివి చీట్ చాట్‌లు అని.. అబద్ధాల ప్రచారానికి చిట్ చాట్‌లను వాడుకుంటున్నారని విమర్శించారు. రుణమాఫీపై రేవంత్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని హితవు చెప్పారు. రుణమాఫీ చేయని గజ దొంగవి నువ్వు.. నన్ను దొంగ అంటావా? అని సీఎం రేవంత్‌పై ఘాటైన వ్యాఖ్యలు చేశారు హరీష్. రుణమాఫీ పాక్షికంగా జరిగిందని మంత్రి ఉత్తమ్ చెప్పారు కదా అని గుర్తు చేశారు. వ్యవసాయ, రెవెన్యూ మంత్రులు కూడా రుణమాఫీ కాలేదని చెప్పిన విషయాన్ని హరీష్ రావు ప్రస్తావించారు.


**హరీష్ రావు కామెంట్స్ యధావిధిగా..** "ఆగష్టు 15వ తేదీ లోపు వంద శాతం రుణమాఫీ చేస్తానని అన్నావ్.. చేశావా? ఓటుకు నోటులో రూ. 50 లక్షలు ఇస్తూ దొరికిన దొంగవు నువ్వు. నన్ను దొంగ అంటావా? రాహుల్ గాంధీని కూడా రుణమాఫీ అయిందని చీట్ చేస్తున్నారు. రాహుల్ గాంధీ ఎప్పుడు హైదరాబాద్ వస్తారో చెప్పాలి. నేనే రిసీవ్ చేసుకుని కొండారెడ్డి పల్లె తీసుకువెళతా. రుణమాఫీ అయిందో లేదో అడుగుదాం. వాస్తవాలు ఏంటో తెలుసుకుందాం.' అంటూ తనదైన శైలిలో ఘాటైన వ్యాఖ్యలు చేశారు హరీష్ రావు.

**కాంగ్రెస్‌పై అవినీతి ఆరోపణలు..** వాల్మీకి స్కామ్ పట్ట పగలు నిలువు దోపిడీ లాంటిదని హరీష్ రావు అన్నారు. తెలంగాణలో 9 అకౌంట్లకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయ్యాయని చెప్పారు. దీనిపై ఈడీ రైడ్స్ ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. సీఎం వస్తే ఇద్దరం వెళ్లి దర్యాప్తు చేయమని ఈడీని కోరతామన్నారు. తెలంగాణ కాంగ్రెస్, తెలంగాణ బీజేపీ భాయి భాయి అన్నట్లుగా ఉందన్నారు. అందుకే వాల్మీకీ స్కామ్‌పై తెలంగాణలో విచారణ జరగడం లేదన్నారు. వాల్మీకీ స్కామ్‌పై రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని హరీష్ రావు ప్రశ్నించారు. దీనిపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. ఈ స్కామ్‌పై ఈడీని కలిసి విచారణ జరపాలని కోరతామని హరీష్ రావు చెప్పారు.

**కూల్చివేతల సర్కార్..** తెలంగాణలో ఏర్పాటైన కాంగ్రెస్ కూల్చివేతల సర్కారే అని హరీష్ రావు విమర్శించారు. 'హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కూల్చివేశారు. వైద్య వ్యవస్థను పూర్తిగా కూల్చేశారు. దేవుళ్ల మీద ఒట్టేసి ప్రజల విశ్వాసాన్ని కూల్చేశారు.' అని ప్రభుత్వ విధానాలను తూర్పారబట్టారు. అంతెందుకు హైడ్రా ఆఫీసే హుస్సేన్ సాగర్ నాలా కింద ఉందని, రంగనాథ్ ముందుగా ఆయన ఆఫీస్ కూల్చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ముందు రంగనాథ్ ఆఫీసును కల్చివేసి ప్రజల మీదకు రావాలన్నారు.

చారిటీ బిగిన్స్ ఎట్ హోం అన్నట్టు.. ముందు నీ ఆఫీస్, జీహెచ్ఎంసీ ఆఫీసు కూలగొట్టాలని అన్నారు. మీరాలం, ఉప్పల్, రామంతపూర్ చెరువుల్లో పెద్ద పెద్ద టవర్స్ వచ్చాయని.. అవి పట్టా భూములు వారికి పరిహారం ఇవ్వాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

**రేవంత్‌కు బీజేపీ బెయిల్ ఇప్పించిందా? :** మంత్రి పొంగులేటి



శ్రీనివాసరెడ్డి ఇంటి నీళ్లు ఎందులోకి వెళ్తున్నాయని హరీష్ రావు ప్రశ్నించారు. ప్రతిపక్షాలను టార్గెట్ చేయడం మంచిది కాదన్నారు. కమిషన్ కాకతీయ అని పిచ్చి పిచ్చి ఆరోపణలు చేస్తున్నారని.. ప్రభుత్వం వారిదే కాబట్టి విచారణ జరిపించుకోవచ్చునని హరీష్ రావు సవాల్ విసిరారు. తెలంగాణ తల్లి విగ్రహ భూమి పూజకు కనీసం మంత్రులు కూడా లేరని విమర్శించారు. తెలంగాణ తల్లి భావనకు రూపం ఇచ్చిందే కేసీఆర్ అని అన్నారు. ఆ క్రెడిట్ కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇదే సమయంలో కవితకు బెయిల్ అంశంపై సీఎం రేవంత్ స్పందించిన తీరును తప్పుపట్టారు. సీఎం స్థానంలో ఉండి న్యాయస్థానాల తీర్పుపై వక్ర భాష్యాలు చెప్పడం మంచి పద్ధతి కాదన్నారు.

ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డికి బెయిల్ బీజేపీ ఇప్పించిందా? అని హరీష్ రావు ప్రశ్నించారు. తమకు సంస్కారం ఉందని.. రేవంత్‌లా నీచంగా తాము మాట్లాడలేమన్నారు. నీ సలహాదారు కేకే స్వాగతించారని.. నువ్వు మాత్రం వక్ర భాష్యాలు చెప్తావా? అంటూ సీఎం తీరుపై హరీష్ ఫైర్ అయ్యారు. ఈ పిచ్చి మాటల వల్లే ఇవాళ సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందన్నారు.

**ప్రభుత్వ భూములు కాజేసే కుట్ర..** ఫోర్త్ సిటీ పేరుతో ప్రభుత్వ భూములు కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని హరీష్ రావు ఆరోపించారు సమయం వచ్చినప్పుడు అన్ని వివరాలను బయటపెడతామన్నారు. కందుకూరు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 9లో 385 ఎకరాల భూమిని కాజేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు.

అలాగే తుక్కుగూడ పరిధిలోని సర్వే నెంబర్ 895లో 25 ఎకరాల పేద రైతుల భూములు బినామీల పేరు మీదకు మారుతున్నాయని హరీష్ రావు ఆరోపించారు. ముచ్చర్లలో సీఎం తమ్ముళ్ల పీఏల పేర్ల మీద కూడా భూములు కొంటున్నారని అన్నారు.

**మోదీ మెప్పు కోసమే..** సీఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో బీజేపీ అభ్యర్థి అరుణను గెలిపించారని హరీష్ రావు అన్నారు.

సీఎం సొంత నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి ఎందుకు మెజారిటీ తగ్గిందని ప్రశ్నించారు. ప్రధాని మోదీ మెప్పు కోసమే రేవంత్ రెడ్డి దగ్గరుండి బీజేపీకి ఓట్లు వేయించారని హరీష్ ఆరోపించారు. ముందు మహేందర్ రెడ్డి, గుత్తా అమిత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసి ఆ తరువాత తమను అడగాలన్నారు.

# రాహుల్‌పై కంగనా వ్యాఖ్యలు.. మండిపడిన వీహెచ్.. పీఎస్‌లో కేసు నమోదు



గాంధీ భవన్: కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ పక్ష నేత రాహుల్ గాంధీపై ఎంపీ, బీజేపీ నేత కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు మండిపడ్డారు. ఈ మేరకు ఆయన కంగనాపై అంబర్‌పేట పోలీస్ స్టేషన్లో గురువారం ఫిర్యాదు చేశారు. కాగా.. రాహుల్ చెత్తగా మాట్లాడతారని, డ్రగ్స్ తీసుకుంటారని కంగనా ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను ఖండించిన వీహెచ్... పాపులారిటీ కావడం కోసమే కంగనా ఇలాంటి వ్యాఖ్యలు చేశారన్నారు. ఆమె ఏదున్నా పార్లమెంట్‌లో మాట్లాడాలని సూచించారు. రాహుల్‌కి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని.. రాహుల్‌తోపాటు బడుగు, బలహీన వర్గాల ప్రజలందరినీ ఆమె అవమానించిందని మండిపడ్డారు.

**హైడ్రా గుడ్ వర్క్..** హైదరాబాద్ మహానగరంలో చెరువులు ఇతర జలవనరుల పరిరక్షణే ధ్యేయంగా రేవంత్ సర్కార్ తీసుకువచ్చిన హైడ్రా వ్యవస్థ భేష్ అని వీహెచ్ పేర్కొన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ చక్కగా పని చేస్తున్నారని కితాబిచ్చారు. అయితే ప్రభుత్వం పేదల ఇళ్లు కూల్చాల్సి వస్తే.. వారికి వేరే చోట డబల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. సీఎం రేవంత్ తన కుటుంబ సభ్యుల అక్రమాలు ఉన్నాయని తేలినా.. కూల్చేయాలని చెప్పడం మంచి విషయమని వీహెచ్ అన్నారు.

# ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం..

ఢిల్లీ: ఓటుకు నోటు కేసుపై దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ ముగిసింది. ఈ కేసు ట్రయల్‌ని భోపాల్‌కి బదిలీ చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. జగదీష్ రెడ్డి దాఖలు చేసిన బదిలీ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారణను ముగించింది. ట్రయల్ జరిగే విషయంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నందున స్పెషల్ ప్రాసిక్యూటర్‌ని నియమిస్తామని ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేసింది. 'మా న్యాయ వ్యవస్థపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. ప్రతి ఒక్కరి మనస్సులో విశ్వాసం ఉండేలా, మీకు అభ్యంతరం లేకుండా ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ను నియమిస్తాం' అని జస్టిస్ గవాయ్ అన్నారు. కేసులో నిందితుడు రేవంత్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణ సీఎంగా ఉన్నారని, దర్యాప్తు సంస్థ ఏసీబీ చూసే హోం శాఖ కూడా ఆయన వద్దే ఉందని జగదీష్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా మహబూబ్ నగర్‌లో జరిగిన ర్యాలీల్లో పలుమార్లు పోలీసులపై బెదిరింపు ధోరణి ప్రదర్శించారని జగదీష్ రెడ్డి తరుఫు న్యాయవాది తెలిపారు. సీఎంగా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చూస్తేనే కేసుపై ప్రభావం ఎలా ఉందో తెలుస్తుందని, ప్రభుత్వం దాఖలు చేసే కౌంటర్ అఫిడవిట్‌లో కూడా వైఖరి మారిందని జగదీష్ రెడ్డి న్యాయవాది తెలిపారు. ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ని నియమించే వ్యవహారాన్ని సుప్రీంకోర్టు నిర్ణయిస్తుందని జస్టిస్ గవాయ్ అన్నారు. తెలంగాణకు చెందిన మా సహచరులను సంప్రదించి ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ను నియమిస్తామని జస్టిస్ గవాయి తెలిపారు. పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని.. పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నామని త్రిసభ్య ధర్మాసనం ప్రకటించింది. కేవలం అపోహలతో విచారణ బదిలీ చేస్తే మన న్యాయవ్యవస్థపై నమ్మకం లేదన్నట్టే అవుతుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'మా న్యాయవ్యవస్థపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. ప్రతి ఒక్కరి మనస్సులో విశ్వాసం ఉండేలా, మీకు అభ్యంతరం లేకుండా ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ను నియమిస్తాం' అని జస్టిస్ గవాయ్ తెలిపారు. తెలంగాణకు చెందిన తమ సహచరులను సంప్రదించి ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ను నియమిస్తామని జస్టిస్ గవాయి వెల్లడించారు. పిటిషన్‌పై విచారణను త్రిసభ్య ధర్మాసనం ముగించింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com